Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 16.03.2018, శుక్రవారం

సంపుటి : 37 సంచిక : 41

పేజీలు : 16, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# గర్జించిన గబ్బర్‌సింగ్



- తొలిసారి చంద్రబాబు అవినీతిపై విమర్శలు
- అభిమానుల్లో ఆనందం
- నిజాలు తెలుసుకోవడానికి నాలుగేళ్ళు పట్టింది

*ఈ పవన్ కళ్యాణ్‌కు ఏమైంది? చంద్రబాబుతో బెడిసిందా? ప్యాకేజీ గడువు ముగిసిందా? కొత్త ప్యాకేజీ కుదరలేదా? లేక తన అంతరాత్మను ప్రశ్నించుకుని వాస్తవ లోకంలోకి వచ్చాడా? 14వ తేదీ గుంటూరులో జరిగిన 'జనసేన' పార్టీ ఆవిర్భావ సభలో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ప్రసంగాన్ని విన్న వారందరినీ తొలిచి వేసిన ప్రశ్నలివే! పవన్ అందరికీ పూర్తి షాకిచ్చాడు.*

(మిగతా 14వ పేజీలో)

• ఏపీలో బీజేపీ

సమీకరణలు మారేనా?

## కలిసేదెవరు? కలబడేదెవరు?




2014 ఎన్నికలప్పుడు బీజేపీతో పొత్తు అంటే ప్రాంతీయ పార్టీలు ఎగబడే పరిస్థితి. నరేంద్ర మోడీ మేనియా అప్పట్లో ఆ స్థాయిలో వుండింది.

(మిగతా 14వ పేజీలో)









# వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

## యం.పి., రాజ్యసభ



- లక్ష్యం నెరవేరింది
- చిరకాల కోరిక తీరింది
- పెద్దల సభలో చోటు దొరికింది

నేను నేనుగా బ్రతకడం కాదు, నేను నలుగురి కోసం బ్రతకడం, నలుగురికి బ్రతుకు నివ్వడం, బ్రతికే మార్గాన్ని చూపించడం... భవిష్యత్ పై ఆశలు కల్పించడం, పది మందికి నేనున్నాననే భరోసా ఇవ్వడం... ఈ మార్గాన్ని నమ్మి ఆచరిస్తున్న వ్యక్తే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. కొందరికి గ్లోబల్ కాంట్రాక్టర్‌గా, ఇంకొందరికి ఆధ్యాత్మికవేత్తగా, మరికొందరికి పారిశ్రామికవేత్తగా పరిచయం. కాని నెల్లూరీయులందరికీ మాత్రం ఒక మానవతావాదిగా, సేవాభిలాషిగా సుపరిచయం.

(మిగతా 2వ పేజీలో)

# కళలకే కళ..కాకతీయ కళా వైభవం



- టిఎస్సార్ ఆధ్వర్యంలో పాలమూరులో కళోత్సవాలు
- బ్రహ్మానందంకు 'హాస్య నట బ్రహ్మ' అవార్డు ప్రదానం

ఓరుగల్లు కాకతీయ కళావైభవాన్ని, ఆ కళలోని గొప్పదనాన్ని చాటుతూ రాజ్యసభ సభ్యుడు, 'కళా బంధు' మన సుబ్బరామన్న మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కాకతీయ కళావైభవ మహోత్సవాలు అందరి ప్రశంసలందుకుంటున్నాయి. కళలన్నా, కళోత్సవాలన్నా టిఎస్సార్‌కు తొలినుంచి మక్కువ ఎక్కువ. అందుకే, కళలకు.. కళోత్సవాలకు సంబంధించి ఏ కార్యక్రమం చేపట్టినా ఎంతో క్రమశిక్షణతో.. విశిష్టమైన రీతిలో హుందాగా ఆ కార్యక్రమాలు నిర్వహించి కళాకారులందరి అభిమానాన్ని పొందుతున్నారాయన. కళాకారుల పట్ల ఆయనకున్న ఆత్మీయత సాటిలేనిది. అందులోనూ కాకతీయ కళల పట్ల ఉన్న అభిమానం ఎనలేనిది. అందుకే, ఈనెల 11న టిఎస్ఆర్ కాకతీయ లలితకళా పరిషత్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన 'కాకతీయ కళావైభవం' కార్యక్రమాలు ఆద్యంతం అందరికీ ఎంతో స్ఫూర్తిని కలిగించాయి. కళలకే కళకళగా అనిపించే ఈ కాకతీయ కళావైభవం వేడుకలు ప్రేక్షకులందరి మనసులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా టిఎస్సార్ మాట్లాడుతూ, కాకతీయ కళావైభవం వేడుకలను దేశవ్యాప్తం చేయాలని తాము కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణలోని ప్రతి జిల్లాలోనూ కాకతీయ కళావైభవోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న తెలంగాణ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ, కాకతీయ కళావైభవం కార్యక్రమాల ద్వారా కాకతీయుల ఘనకీర్తిని విశ్వవ్యాప్తం చేయడానికి టి.సుబ్బరామిరెడ్డి చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు. ఎంపి జితేంద్రరెడ్డి మాట్లాడుతూ, నాడు కాకతీయులు చేసిన అభివృద్ధి నేటికీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



## బ్రహ్మానందంకు బ్రహ్మాండమైన సత్కారం :

ఈ వేడుకల్లో భాగంగా టిఎస్సార్ నేతృత్వంలో ప్రముఖ సినీహాస్యనటుడు బ్రహ్మానందంకు బ్రహ్మాండమైన సత్కారం జరిగింది. 1100 చిత్రాలు పూర్తిచేసుకున్న బ్రహ్మానందంకు ఈ సందర్భంగా ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'హాస్య నటబ్రహ్మ' బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం చేతికి స్పీకర్ మధుసూదనాచారి బంగారు కంకణం తొడిగి వీణను, జ్ఞాపికను బహుకరించారు. ఆ తర్వాత, పాలమూరు జిల్లాలో ఆయా రంగాల్లో విశిష్టసేవలు అందించిన ప్రముఖులు కపిలవాయి లింగమూర్తి, గోరటి వెంకన్న, ఎల్లూరి శివారెడ్డి, వనజ ఉదయ్, డాక్టర్ వి.నీరజ, సిహెచ్ హరీశ్, గోరట్ల రోజా తదితరులకు కాకతీయ కళావైభవం పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కళావైభవోత్సవాల్లో ఎంపి జితేంద్రరెడ్డి, కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్, ప్రముఖ నటీమణి జయప్రద, సినీనటులు రాజశేఖర్, జీవిత, శ్రద్ధాదాస్ తదితరులతో పాటు హాస్యనటులు బాబూమోహన్, అలీ, శివారెడ్డి, రఘుబాబు, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. టిఎస్సార్ నేతృత్వంలో ఎంతో ఆహ్లాదపూరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో అక్కడి ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, యం.పి., రాజ్యసభ

(మొదటి పేజీ తరువాయి)



రిటర్నింగ్ అధికారి నుండి ధృవీకరణ పత్రం అందుకుంటున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఇంతకాలం ఆయనకు ఏ రాజకీయ పదవులు లేవు, రాజ్యాంగ పదవులు లేవు. అయినా తన సొంత నిధులతోనే జిల్లా ప్రజలకు సేవాసువాసనలు చూపించాడు. జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని మండలాలలో మినరల్ వాటర్ ప్లాంట్లు నెలకొల్పడం, విపిఆర్ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్య సంస్థలను నెలకొల్పడం, ప్రగతి ఛారిటీస్‌కు ప్రతి ఏటా ఆర్థిక సాయం, వృద్ధాశ్రమాలకు చేయూత నివ్వడం, ఇస్కాన్ సంస్థకు అందిస్తున్న సహకారం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఇస్తున్న విరాళాలు, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిఏటా పేద విద్యార్థులకు కిట్ల పంపిణీ, శ్రీవారి ఆలయానికి రూఫ్, శ్రీ కాళహస్తీశ్వరునికి స్వర్ణ వాహనాలు... ఇలా ఒకటేమిటి ఆయన చేసిన సేవా కార్యక్రమాలు రాసుకుంటూ పోతే పేజీలు చాలవు. ఎటువంటి అధికారం లేకుండా, ఎలాంటి రాజకీయ పలుకుబడి లేకుండా కేవలం ఒక సామాన్య వ్యక్తిగా ఆయన ఇన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మరిప్పుడు ఆయన రాజకీయ శక్తిగా కూడా రూపుదాల్చారు. ఈ నెల 15వ తేదీ గురువారం రాష్ట్రంలోని మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి జరిగిన నియామకాలలో వైసిపి నుండి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ నెల 23న ఎన్నికలు జరగవలసి వుండగా ఆ అవసరం లేకుండానే ఆయన ఏకగ్రీవంగా ఎన్నికకాబడి మార్చి 15వ తేదీ ఉదయం ఎన్నికల అధికారి నుండి రాజ్యసభ సభ్యుడిగా ధృవీకరణ పత్రం అందుకున్నారు.

2014లోనే ఆయన వైసిపిలో చేరి రాజకీయ ఆరంగేట్రం చేసినా, రాజ్యసభసభ్యుడిగా ఎన్నికకావడం ఆయన జీవితంలో పెద్ద మలుపు. రాజ్యసభకు వెళ్లాలన్న ఆయన ఆలోచన వెనుక అధికార యావ, పదవిని అడ్డం పెట్టుకుని సంపాదించాలన్న ఆశ లేదు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు అధికారం తోడైతే ఇంకా ఎక్కువ చేయొచ్చని, ఎక్కువమందికి తన సేవలను అందించవచ్చని ఆలోచన.

సంపాదించే అవకాశం దేవుడు చాలామందికి ఇస్తాడు. దానిని పదిమంది మంచి కోసం ఖర్చుపెట్టే గుణం కొందరికే ఇస్తాడు. ఆ కొందరిలో ఒక్కడే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి రాజ్యసభకు వెళుతున్న రెండో వ్యక్తి. ఇప్పటివరకు ఆయన ఒక వ్యక్తిగా ప్రజాసేవలో రాణించాడు. ప్రజల మనసుల్లో నిలిచాడు. ఇక రాజకీయ శక్తిగా, రాజ్యసభ సభ్యుడిగా కూడా నెల్లూరుజిల్లా ప్రజల సేవకు సదా సిద్ధం అంటూ వస్తున్నాడు. ఇన్నాళ్ళు ఆయన కేవలం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కానీ ఈరోజు నుండి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడు.


ఇది కేవలం ఆయన ఒక్కడే ఆనందించే విషయం కాదు. ఆయన అభిమానించే నెల్లూరుజిల్లా ప్రజానికమంతా పండుగ చేసుకునే రోజు. నిజాయితీకి, సేవానిరతికి నిలువెత్తు సాక్ష్యమైన స్వచ్ఛమైన మనసున్న మంచి మనిషి రాజ్యసభ సభ్యుడిగా తొలి రాజకీయ పదవిని అధిరోహించడం ఆయనకు కాదు జిల్లాకి సైతం శుభసూచకం.

లక్ష్యాన్ని ఛేదించి, అనుకున్నది సాధించి, తన చిరకాల కోరిక నెరవేర్చుకున్న ప్రభాకర్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

# జయహో... విపిఆర్



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ఆయన స్వగృహంలో బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరం జరుపుకున్న విపిఆర్ ఫౌండేషన్ మరియు కన్వెన్షన్ సెంటర్ సిబ్బంది


ఆత్మీయ అభినందన
రాజ్యసభ సభ్యుడిగా మీ తొలిఅడుగు
జిల్లా అభివృద్ధికి ముందడుగు
కావాలని ఆకాంక్షిస్తూ...
ప్రభాకరన్నా...
దాతృత్వానికి ప్రతీకగా
మానవత్వానికి పతాకగా
సింహపురి కీర్తి శిఖరంగా
వెలుగొందుతున్న మీకు
ఈ శుభవేళ...
ఆత్మీయ అభినందనలు.
నెల్లూరు
SMD
HOMES
బెంగుళూరు

## 'ప్రభా'తం

# అన్నదాత ఆగ్రహిస్తే...



తమ కష్టాలు తీర్చాలంటూ మహారాష్ట్ర రైతులు రోడ్డెక్కారు. సుమారు 60వేల మంది కర్షకులు 'మహాపాదయాత్ర' చేసి రైతన్న ధీశక్తి ఏమిటో ప్రభుత్వానికి కళ్ళారా చూపించారు. దాదాపు 180 కిలోమీటర్ల దూరం.. ఎండను సైతం లెక్కచేయక.. వారం రోజులపాటు పాదయాత్ర చేశారు. ఎట్టకేలకు విజయం సాధించారు. ఈ మహాపాదయాత్రతో అక్కడి బిజెపి ప్రభుత్వం దిగివచ్చింది. రైతుల కోర్కెలన్నిటినీ తీరుస్తామని మాటిచ్చింది. దీంతో అన్నదాతలు శాంతించి ఆందోళన విరమించారు.

అదేమి వింతపోకడో తెలియదు గానీ, ఏలినవారికి జనం సమస్యలు తెలిసినా పట్టనట్లుంటుంటారు. ఎన్నిసార్లు తమ కష్టాలు కుయ్యోమొర్రోమంటూ విన్నవించుకున్నా 'సరే చూద్దాం..చేద్దాం' అంటూ నాన్చేస్తుంటారు. ఇక ఆ కష్టాలు భరించలేకనో, లేదా నేతల నిర్లక్ష్యాన్ని సహించలేకనో ఆగ్రహం ప్రదర్శించి ఏ నిరసనలో, ఆందోళనలో చేస్తే.. నాయకులు ఇక తప్పదన్నట్లుగా అప్పుడు 'అన్నీ చక్కదిద్దుతామని' చెప్పి చేతులు దులుపుకుంటుంటారు. ఇవన్నీ మనం చూస్తున్నవే. రాజకీయాల్లో ఇలాంటివి సర్వసాధారణమై పోతున్నాయి. అయితే, అన్నిటికీ ఒకే మంత్రం పనికిరాదు. అందులోనూ, అందరికీ అన్నం పెట్టే అన్నదాతల విషయంలో నాయకులు నిర్లక్ష్యం ప్రదర్శించడం మంచిదికాదు. రైతే దేశానికి వెన్నెముక అంటూనే, జై కిసాన్ అంటూ జైజైలు కొడుతూనే.. రైతన్నే లేకపోతే దేశానికి అన్నం పెట్టేదెవరు?.. అంటూనే, మరోవైపు ఆ కర్షకుల కన్నీటిని మాత్రం పట్టించుకోకపోవడం ఎంత బాధాకరమో!..అందులోనూ వ్యవసాయమే ప్రధానంగా ఉన్న మన దేశంలో ఏళ్ళ తరబడిగా రైతుల పరిస్థితిని కానీ, రైతు కుటుంబాల దయనీయ స్థితిని గానీ పాలకులు పట్టించుకోకపోవడం విచారకరం. పచ్చని పంటపొలాలతో దేశాన్ని పత్రహరితం చేసి, సస్యశ్యామలం చేసే రైతుల బాధలను నిర్లక్ష్యం చేయడం కంటే ఘోరమైన విషయం ఇంకోటుంటుందా?.. ఇవన్నీ నేతలకు తెలియని విషయాలేమీ కావు. కానీ, వారి వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. కాలాలు మారినా, తరాలు మారినా.. ప్రభుత్వాలు మారినా... నేతలే మారినా చివరికి అన్నదాతల తలరాతలు మాత్రం మారనే మారడం లేదు. వారి కష్టాలు మాత్రం తీరనే తీరడం లేదు. సేద్యానికి పొలం వద్దకు వెళ్ళినకాడి నుంచీ ఎన్నో రకాల సమస్యలు. పంట పండేదాకా ఎన్నో బాధలు, వ్యయప్రయాసలు. దీంతో ఇంటినిండా అప్పుల కుప్పలు. ఎలాగో ఆరుగాలం కష్టించి, చెమటోడ్చి పంటలు పండించినా చివరికి తిండిగింజలు ఇంటిదాకా వస్తాయన్న గ్యారంటీ ఏమీ ఉండదు. ఏ అకాల వర్షానికో పంట నీట మునిగిపోవచ్చు. లేదా సరైన గిట్టుబాటు ధరలు లేక చేసిన కష్టమంతా నష్టాల పాలుకావచ్చు. రైతన్నలు ఇలా ఏళ్ళ తరబడి బాధల సుడిగుండాల్లో మునిగిపోతూ..వారి కుటుంబాలు అప్పుల నిప్పుల్లో కాగిపోతుంటే.. రైతు తనకు తానే కరిగిపోయిన కన్నీటిముద్ద అవుతాడే తప్ప, ఎవరికీ ఆ బాధను తెలియనివ్వడు. చిరునవ్వుతోనే మళ్ళీ సేద్యం చేసి పంటలు పండించాలనే తపనతో.. పొలాలవైపు అడుగులువేసే అత్యంత సహనశీలి..అన్నదాత. అందుకే, సహనంలో భూమాత తర్వాత అంతటి స్థానం అన్నదాతదే నంటుంటారు పెద్దలు. అలాంటి అన్నదాతలో సహనం నశిస్తే..అన్నదాతకే ఆగ్రహం వస్తే... ఏమవుతుంది?.. సాగరములన్నీ ఏకము గాకపోవచ్చుగాక... ప్రభుత్వాలు దిగిరాక తప్పదు. సరిగ్గా ఇప్పుడు ముంబైలో జరిగింది కూడా ఇదే. ఏళ్ళ తరబడిగా తమ సమస్యలు పట్టించుకోని ప్రభుత్వతీరుపై రైతులు ధర్మాగ్రహం వ్యక్తం చేశారు. పంట రుణాలను సంపూర్ణంగా అందజేయాలని, విద్యుత్ బిల్లులను మాఫీ చేసి ఆదుకోవాలని, విపత్తుల్లో దెబ్బతిన్న బాధిత రైతాంగానికి బాసటగా ఉంటూ తగు పరిహారం అందించాలని, ఆదివాసీలు సాగుచేసుకుంటున్న అటవీభూములను వారికే కేటాయించాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని తదితర డిమాండ్ల సాధనకు రోడ్డెక్కారు. వేలాదిమంది నినాదాలు చేస్తూ రోడ్డెక్కడంతో ముంబైవాసులు సైతం ఆశ్చర్యపోయారు. ఎన్నిసార్లు విజ్ఞాపనలు చేసుకున్నా తమను పట్టించుకోని మొండిసర్కార్లు అవాక్కయ్యేలా చేసేందుకు.. ఎవరూ ఊహించనివిధంగా సుమారు 60వేల మంది కర్షకులు 'మహాపాదయాత్ర' చేసి రైతన్న ధీశక్తి ఏమిటో ప్రభుత్వానికి కళ్ళారా చూపించారు.. కాళ్ళారా నడిచి మరీ చూపించారు. దాదాపు 180 కిలోమీటర్ల దూరం..ఎండను సైతం లెక్కచేయక.. కాళ్ళు కాలుతున్నా కఠోరదీక్షతో పాదయాత్ర చేశారు. ఎండదెబ్బకు కాళ్ళు వాడిపోయి పుండ్లు పడినా మహిళా రైతులు సైతం రోడ్డుమీంచి పక్కకు వెళ్ళలేదు. యాత్ర వారం రోజులపాటు ఎంతో క్రమశిక్షణగా ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సాగడం మరో విశేషం. ఇది రైతుల లాంగ్‌మార్చ్‌గా అందరి కితాబును అందుకోవడం వేరే విషయం. తమ కష్టాలు తీర్చాలంటూ, రాజ్యాంగబద్ధమైన తమ హక్కుల సాధన కోసం వేలాదిమంది రైతులు నాసిక్ నుంచి ముంబైకి పాదయాత్రగా బయలుదేరారు. కర్షకులంతా వేలాదిగా కదలివస్తున్న దృశ్యం చూసి ముంబై అవాక్కయింది. ఆ మహాకర్షక జనసముద్రాన్ని చూసి ముంబైవాసులంతా నివ్వెరపోయారు. ఆయాప్రాంతాల్లో జనం వారిని ఆదరించి స్వాగతించారు. నీళ్ళు, బిస్కెట్లు అందించారు. ఆ కష్టజీవులకు రెండుచేతులా తమ సౌహార్ద్రాన్ని అందించారు. సిపిఎం అనుబంధసంస్థ అయిన అఖిలభారత కిసాన్‌సభ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర జరిగింది. ఈ మహాపాద యాత్రతో మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వం దిగివచ్చింది. ప్రతిపక్షాలతో పాటు, శివసేన నాయకుల వత్తిడితో అన్నదాతలు కోరిన కోరికలన్నిటినీ తీర్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో ఎట్టకేలకు కర్షకులు శాంతించారు. తమ ఆందోళన విరమించారు. ఇది రైతుల ఘనవిజయంగా అందరూ కొనియాడారు.

అయినా, ఆ శ్రమజీవుల కష్టాలను ప్రభుత్వాలు ఇన్నేళ్ళుగా పట్టించుకోకపోవడం.. వారు ఎండల్లో రోడ్లెక్కి పాదయాత్రలు చేసే దుస్థితిని తీసుకురావడం ఎంత బాధాకరం?.. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలను నిర్లక్ష్యం చేయడం, వారి బాధలు తీర్చకపోవడం ఎంత విచారకరం. ఇకనైనా ప్రభుత్వాలు.. పాలకుల తీరు మారాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వదిలి అన్నదాతలను అన్నివిధాలుగా ఆదుకోవాలి. మాటలతో రైతులను మభ్యపెట్టక..చిత్తశుద్ధితో వారిని ఆదుకోవాలి. సమాజానికి..దేశానికి.. అందరికీ అన్నం పెట్టే రైతన్న కంటనీరు పెట్టుకునే దుస్థితి ఇకనైనా పోవాలి. కర్షకులు, వారి కుటుంబాలు చల్లగా పదికాలాలపాటు జీవించినప్పుడే అందరికీ ఆనందం. అదే..దేశానికీ సౌభాగ్యం!....

# జాతీయ వైద్య కమిషన్ బిల్లును రద్దు చేయాలి

**- ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్**

జాతీయ వైద్య కమిషన్ బిల్లు (ఎన్‌ఎంసి)ను వెంటనే రద్దు చేయాలంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్ డిమాండ్ చేశారు. ఎన్‌ఎంసి బిల్లుకు వ్యతిరేకంగా ఐఎంఏ నాయకులు నెల్లూరు దర్గామిట్టలోని ఐఎంఏ హాలు నుంచి వైద్యకళాశాల వరకు ఈ నెల 11న సైకిల్ ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ వైద్య కమిషన్ బిల్లుతో వైద్యవృత్తి, వైద్య విద్య, వైద్య సేవా రంగం అత్యంత ప్రమాదస్థితిలో పడ్డాయన్నారు. గ్రామీణులకు ఆధునిక వైద్యం అందుబాటులో లేకుండా చేస్తున్న ఎన్‌ఎంసి బిల్లును అందరూ వ్యతిరేకించాలన్నారు. ఎన్‌ఎంసి బిల్లుతో మెరిట్ విద్యార్థులకు ఎంబిబిఎస్ కోర్సు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందన్నారు. బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి తగిన విధంగా నిధులు కేటాయించకుండా, కొత్త చట్టాలతో వైద్యరంగాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో తమ అసోసియేషన్ గత ఏడాదిగా ఎన్‌ఎంసి బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోందన్నారు. బడ్జెట్ సమావేశాల సమయంలో ఎన్‌ఎంసి బిల్లును పునఃప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లు ఆమోదం పొందకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ భక్తవత్సలం, డాక్టర్ మల్లికార్జునయ్య, నగర అధ్యక్షుడు డాక్టర్ ఉదయ్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ శేషరెడ్డి, డాక్టర్ శ్రీనివాసతేజ, ఏపిడిజిఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఠాకూర్, డాక్టర్ సుజయ్‌సదా పాల్గొన్నారు.

# నెల్లూరు జర్నలిస్టుల ర్యాలీ




కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 200 కోట్లు కేటాయిస్తామని, 70 శాతం రాయితీతో త్రిబుల్ బెడ్‌రూం ఇళ్ళను నిర్మిస్తామని హామీలు ఇచ్చినా, నేటికీ ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చలేదని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తూనే ఉందని ఏపియుడబ్ల్యుజె యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో ఈనెల 10న నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, దేవకుమార్, రామమూర్తి, అనూక్ పాల్గొన్నారు.

## అది గురుద్రోహమే!

ఇటీవల సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతుంది. త్రిపుర సీఎం ప్రమాణస్వీకారోత్సవ సభలో ప్రధాని మోడీ వేదిక మీదకొచ్చినప్పుడు అందరూ లేచి నిలబడతారు. వారిలో బీజేపీ సీనియర్ నేత అద్వానీ కూడా వున్నారు. అందరితో పాటు ఆయన కూడా ప్రధానికి నమస్కరిస్తారు. కాని అందరికీ ప్రతి నమస్కారం చేసిన మోడీ అద్వానీ వైపు మాత్రం కనీసం చూడకుండానే వెళ్ళిపోతాడు. నిజంగా అద్వానీ మీద ఏదన్నా మనసులో పెట్టుకుని మోడీ ఈ విధంగా వ్యవహరించి వుంటే అదే అతని నైతిక పతనానికి పరాకాష్ట అవుతుంది. కాకతాళీయంగా ఇలాంటివి జరిగితే అది పొరపాటు అనుకోవచ్చు. కాని వేదిక మీద ఒకటికి రెండుసార్లు అద్వానీ నిలబడ్డా కూడా మోడీ ఆయనకు గౌరవమివ్వకపోవడం గురుద్రోహమే!

*కుల్లూరు సుబ్రహ్మణ్యం, నెల్లూరు.*

## అప్పుడు వద్దన్నది ఇప్పుడు ముద్దైంది

ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడానికి బీజేపీ కారణమైతే రాకపోవడానికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే! ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని కేంద్రం చెప్పినప్పుడే చంద్రబాబు అడ్డం తిరిగి వుండాలి. పార్లమెంటులో హామీ ఇచ్చి ఇప్పుడు మాట ఎందుకు తప్పుతున్నారని నిలదీసి వుండాలి. ఇవ్వకపోతే ఎన్డీఏ నుండి బయటకొచ్చి వుండాలి. కాని, చంద్రబాబు ప్రత్యేకహోదా కంటే ప్రత్యేక ప్యాకేజీపైనే ఎక్కువ మక్కువ చూపాడు. హోదా వస్తే ప్రజలకు లాభం... ప్యాకేజీ వస్తే తనకు ప్రయోజనం. ఈ లెక్కలోనే వెళ్ళి రాష్ట్రాన్ని అన్యాయం చేశాడు. ఇప్పుడు హోదా ఉద్యమం ఊపందుకునేసరికి ప్రజల్లో బ్యాడ్ అయిపోతానని మాట మార్చి హోదా అంటున్నారు.

*కర్రా నాగిరెడ్డి, బద్వేలు.*

## పన్నుల వసూలులో నిర్లక్ష్యం

నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ 2018 డిసెంబర్ 31లోగా మున్సిపల్ పన్నుల వసూలుకు టార్గెట్ పెట్టి వున్నారు. రెవెన్యూ విభాగం వాళ్ళు ఎందుకో యుద్ధ ప్రాదిపదికన పన్నులు వసూలు చేసేందుకు ఆపసోపాలు పడుతున్నారు. రెవెన్యూ సిబ్బంది సక్రమంగా పన్నులు కట్టేవాళ్ళనే పట్టుకుంటున్నారు. పన్నులు ఎగవేస్తున్న వాళ్ళ వివరాలు, సమాచారం వీరి వద్ద లేనట్లుగా వుంది. పన్నులు కట్టేవాళ్ళు ఎలాగూ కడతారు. కొంచెం వెనుకా ముందంతే! కాని కార్పొరేషన్ వాళ్ళు దృష్టి పెట్టాల్సింది ఇప్పటి దాకా పన్నులు కట్టని వాళ్ళపైనే! వారి చేత కట్టిస్తే కార్పొరేషన్ ఆదాయం మరింతగా పెరుగుతుంది.

*ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.*



## చిగురించని ఆశ...

# బీదకు మిగిలింది నిరాశ



రాజ్యసభ రేసులో చివరివరకు పోరాడిన మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు చివరి క్షణంలో వెనుకబడిపోయాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా సున్నితంగా ఆయనను పక్కకు తప్పించాడు. దీంతో ఈసారి రాజ్యసభ పై గంపెడాశలు పెట్టుకున్న బిఎంఆర్‌కు చివరకు నిరాశే మిగిలింది.

2014 ఎన్నికల్లో కావలి నుండి ఓటమి చెందిన మస్తాన్ రావును చంద్రబాబు రాజధానికమిటిలో సభ్యులుగా నియమించారు. అలాగే ఆయన కావలి ఇన్‌ఛార్జ్‌గా కూడా వ్యవహరిస్తూ వస్తున్నారు. అయితే ప్రత్యక్ష రాజకీయాల కంటే రాజ్యసభకు వెళ్ళడమే మేలనుకున్న మస్తాన్‌రావు ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. గతంలో ఒకసారి రాజ్యసభ ఎన్నికలు జరిగినప్పుడు గట్టిగానే ప్రయత్నించాడు కాని సఫలం కాలేదు. ఆ తర్వాత టీటీడీ బోర్డు ఛైర్మెన్‌గా కూడా ఆయన పేరు ప్రచారంలోకి వచ్చింది. అది కూడా సక్సెస్ కాలేదు.

ఇప్పుడు రాష్ట్రంలో మూడు రాజ్యసభ పదవులకు ఎన్నికలొచ్చాయి. ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి టీడీపీకి రెండు, వైసిపికి ఒకటి దక్కాయి. తెలుగుదేశంకు దక్కే రెండు పదవుల్లో ఒకదాని కోసం బీద మస్తాన్‌రావు గట్టిగా ప్రయత్నించాడు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో పాటు జిల్లా పార్టీ నాయకులు కూడా బీఎంఆర్‌కు ఈ విషయంలో మద్దతుగా నిలిచారు. చివరి వరకు కూడా బీఎంఆర్‌కు రాజ్యసభ గ్యారంటీ అనే ప్రచారం సాగింది. అయితే చివరి క్షణంలో చంద్రబాబు మొండిచేయి చూపారు. బీదకు రాజ్యసభను ఇవ్వకపోవడానికి చంద్రబాబు చెప్పిన కారణం మీరు రాజ్యసభకు వెళితే కావలిలో ఇక అభ్యర్థి లేడని! ఇది నిజమే. ఇంకో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. కావలి తెలుగుదేశంపార్టీకి బీద సోదరులే నాయకులు. బీద రవిచంద్ర ఎమ్మెల్సీగా వున్నాడు. ఆయనకు ఇంకా పదవీ కాలం వుంది. బీద మస్తాన్‌రావు కావలి ఇన్‌ఛార్జ్‌గా వుంటున్నాడు. కావలి అసెంబ్లీకి గట్టి అభ్యర్థి బీద మస్తాన్‌రావే! ఆయన రాజ్యసభకు వెళితే కావలికి కొత్త అభ్యర్థిని వెదుక్కోవాల్సిన పరిస్థితి. ఎలక్షన్ చేయగల సత్తా వున్నోళ్ళంతా రాజ్యసభకు, శాసనమండలికి వెళితే రేపు ఎలక్షన్‌లలో పోటీ చేసేదెవరు? ఈ కోవలోనే బీఎంఆర్ ఆశలు గల్లంతయ్యాయని తెలుస్తోంది.

# విద్యార్థులు తప్పు చేస్తే... పంతుళ్ళకు పనిష్మెంట్

ఈ నెల 14వ తేదీతో ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిసాయి. పక్కరోజే 15వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసారు. జిల్లాలో 169 పరీక్షా కేంద్రాలున్నాయి. 33100 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారు. మొత్తం 169 పరీక్షా కేంద్రాలలో 32 కేంద్రాలను ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. మిగతావి ప్రభుత్వ పాఠశాలల్లోనే! హాల్ టిక్కెట్లు చూపిస్తే పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

ఇదంతా బాగానే వుంది. టెన్త్‌లో మాస్ కాపీయింగ్ ఎక్కువ. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు తమ విద్యార్థులున్న చోట ఇన్విజిలేటర్లను లోబరుచుకుని మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుంటాయి. ఈ పరిస్థితులను అడ్డుకునేందుకు కఠిన నిబంధనలు పెట్టారు. పరీక్ష హాలులో మాస్ కాపీయింగ్ జరిగినా, విద్యార్థుల వద్ద స్లిప్పులు దొరికినా ఇన్విజిలేటర్లపై కూడా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గత ఏడాది ఇన్విజిలేటర్ల మూలంగానే ప్రశ్నాపత్రాలు లీకయ్యాయి. కార్పొరేట్ విద్యాసంస్థల ప్రోద్భలంతోనే ఇలాంటివి జరిగాయి. వీటి వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో శ్రద్ధగా చదువుకునే విద్యార్థులు నష్టపోతూ వచ్చారు. కనీసం ఈ సంవత్సరమన్నా గట్టిగా పరీక్షలు నిర్వహిస్తారేమో చూడాలి!

# ఇద్దరూ నెల్లూరోళ్ళే!






వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్థాపించాక ఆ పార్టీ నుండి రాజ్యసభకు వెళ్ళడానికి ఇద్దరికి అవకాశం లభిస్తే వాళ్లిద్దరు కూడా నెల్లూరీయులే కావడం విశేషం. తొలిసారి వచ్చిన అవకాశంతో పార్టీకి నిర్విరామంగా సేవలందిస్తూ వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి అత్యంత విశ్వాసపాత్రుడిగా వున్న వేణుంబాక విజయసాయిరెడ్డిని రాజ్యసభకు పంపడం తెలిసిందే! రాజ్యసభలో వైకాపా తరపున ఆయన ఒక్కడే వున్నప్పటికి రాష్ట్ర సమస్యల మీద, ప్రత్యేకహోదా మీద శక్తికిమించి పోరాడాడు. వైకాపాకు ఢిల్లీలో ఒక ట్రాక్‌ను ఏర్పాటు చేశాడు. ఆయన స్వస్థలం నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలంలోని తాళ్ళపూడి గ్రామం. ఇప్పుడు రెండో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిది కూడా నెల్లూరే కావడం గమనార్హం. ఇలా నెల్లూరీయులు వైసిపిని ఆదరించినట్లే, వైసిపి కూడా నెల్లూరీయులకు అధిక ప్రాధాన్యతనివ్వడం విశేషం.

# పవన్‌కు తోడైన 'సింహపురి పవర్'



పవన్‌కళ్యాణ్ హీరోగా నటించిన 'అత్తారింటికి దారేది' సినిమాలో హీరో అత్త పాత్రధారి నదియాతో... "నీ వెనుక తెలియని అదృశ్యశక్తి ఏదో ఉందమ్మా, అది వున్నంత వరకు నిన్నెవరూ ఏమీ చేయలేరు"అని పోసాని కృష్ణమురళి అంటాడు. ఆ తరహాలోనే ఇప్పుడు పవర్ స్టార్ పవన్‌కళ్యాణ్ వెనుక కూడా ఒక శక్తి చేరివుంది. ఆ శక్తి పేరే మాదాసు గంగాధరం. నెల్లూరుజిల్లాకు చెందిన మాజీఎమ్మెల్సీ. పవన్‌కళ్యాణ్‌కు పవర్‌స్టార్ అన్నది ఎవరో ఇస్తే ఇచ్చిన బిరుదు. అంతేగాని, ఆయనకున్న పవర్‌ను చూసి ఇచ్చిన బిరుదు కాదు. పవన్ కళ్యాణ్‌తో పోలిస్తే మాదాసు గంగాధరం ఇంకా పవర్‌ఫుల్. ఆయన పవర్ ధాటికి ఒక ఎన్టీఆర్... ఒక మాగుంట సుబ్బరామరెడ్డి... ఒక నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి... ఒక కేశవరావు... ఒక వై.యస్.రాజశేఖరరెడ్డి... ఒక బొత్స సత్యనారాయణ... ఏదో ఒకరకంగా నష్టపోయిన వాళ్లే! దెబ్బతిన్నవాళ్ళే! ఇప్పుడా పవర్ పవన్‌కళ్యాణ్‌కు తోడైంది. ఆయన పార్టీ జనసేన బ్రతుకేంటో, భవిష్యత్ ఏంటో ఇక ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.



## నెల్లూరు కబుర్లు

# ఉపరాష్ట్రపతి, సిఎం రాక



భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులు ఈ నెల 24వ తేదీన నెల్లూరుకు వస్తున్నారు. వెంకటేశ్వరపురంలోని యాష్‌పాండ్‌లో నిర్మించిన 'హౌస్ ఫర్ ఆర్' గృహ నిర్మాణాల సముదాయం ప్రారంభోత్సవంలో వారు పాల్గొనను న్నారు. ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో వెంకయ్యనాయుడు రేణిగుంట ఎయిర్‌పోర్టులో దిగుతారు. అక్కడనుండి వైమానిక దళ హెలికాప్టర్‌లో నెల్లూరుకు చేరుకుంటారు. ఇళ్ళ కార్యక్రమం ప్రారంభోత్సవం అనంతరం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకుని ముఖ్యులను కలుస్తారు. 25వ తేదీ ఉదయం తిరిగి హెలికాప్టర్ ఎక్కి రేణిగుంటకు వెళతారు. సీఎం మాత్రం 24వ తేదీనే తిరిగి వెళ్ళిపోతారు. ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం భారీఎత్తున బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది.

# రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యం



ఆవిర్భావ దినోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న ముక్కాల ద్వారకానాథ్

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ సూచనల మేరకు నగర డిప్యూటిమేయర్ ముక్కాల ద్వారకానాథ్ నెల్లూరు నగరంలోని రాజన్న భవన్‌లో కేక్ కట్ చేసి కార్పొరేటర్లు, నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ముక్కాల మాట్లాడుతూ దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన కర్షక, కార్మిక, విద్యార్థి, మహిళలకు సంబంధించిన సంక్షేమ పథకాలను తిరిగి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో వై.యస్. జగన్మోహన్‌రెడ్డి స్థాపించిన పార్టీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్న నాయకులు జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు. మన మందరం ఆయనతో కలిసి నడవాలని, తిరిగి రాజన్న రాజ్యం రావాలంటే జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నెంబర్ ఇక పక్కా!

**24-16-1721**

'చాలా బాగుంది' సినిమా చూసే వుంటారు... ఆ సినిమాలో హైదరాబాద్ వెళ్ళిన ఎల్.బి.శ్రీరాంకు అడ్రస్ వెదుక్కుంటున్న ఎం.ఎస్.నారాయణ కనిపిస్తాడు. డోర్ నెంబర్ చెప్పమంటే... 24-416×212÷6/15=101... ఇలా గజిబిజిగా అంకెలు చెబుతాడు. ఇప్పుడు నెల్లూరు నగరంలో డోర్ నెంబర్‌లు కూడా ఇంతే గజిబిజిగా వున్నాయి. ఒక్కో ఇంటికి పాత నెంబర్ ఒకటి కొత్త నెంబర్ అని ఒకటి ఉన్నాయి. ఇళ్ళకు ఇళ్ళకు మధ్యలో కొత్త ఇల్లు, అపార్ట్‌మెంట్లు వచ్చాయి. ఈ ఇంటి నెంబర్ల మీదే ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు వేస్తుంటారు. 4ఏళ్ల క్రితం నగరంలో అన్ని ఇళ్లకు కొత్త నెంబర్‌లు వేశారు. గతంలో ఖాళీ ఫ్లాట్లను వదిలేసి ఉన్న ఇళ్ళకు నెంబర్లు ఇచ్చారు. ఇప్పుడు కొత్తగా ఇళ్లు వచ్చాయి. వాటికి నెంబర్లు ఇవ్వాలి. అదేకాక శివారు గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేసారు. ఇవి పంచాయితీ పరిధిలో వున్నప్పుడు వాటి డోర్‌నెంబర్లు వేరేగా వుంటాయి. ఇప్పుడు కార్పొరేషన్ పరిధిలోకి వచ్చాక నెంబర్లు మారనున్నాయి.

ఈ గందరగోళాన్ని తొలగించేందుకు నెల్లూరు కార్పొరేషన్ శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ప్రతి ఇంటికి డిజిటల్ నెంబర్ ఇవ్వనున్నారు. ఈ నెంబర్ మీద ఇక ఆస్థిపన్నులు, కొళాయి పన్నులు రానున్నాయి. అలాగే ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, గ్యాస్ కార్డు వంటి వాటిలో కూడా ఇక డిజిటల్ డోర్ నెంబర్ ఒక్కటే శాశ్వతంగా నమోదై వుంటుంది.

### హెచ్‌ఆర్‌పిసి జిల్లా అధ్యక్షుడిగా

# శ్రీనివాసరావు



నియామక పత్రాన్నందుకుంటున్న శ్రీనివాసరావు

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటి (మానవ హక్కుల పరిరక్షణ కమిటి) జిల్లా అధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు(నెల్లూరు) నియమితులయ్యారు. ఈ నెల 12న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విజయవాడలోని ఓ హోటల్‌లో ఈ నెల 11న జరిగిన మానవహక్కుల పరిరక్షణ కమిటి రాష్ట్ర సదస్సులో కమిటి రాష్ట్ర అధ్యక్షుడు బాబు ఖాన్, గౌరవాధ్యక్షులు పొనకాల వెంకట మహాలక్ష్మి తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. కమిటి జిల్లా ఉపాధ్యక్షులుగా షేక్ సుభాని, రాధా కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శిగా సి.వి. నాగలక్ష్మిలను నియమించినట్లు తెలిపారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
**అమ్మ ఫర్నిచర్ మాల్**
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# ప్రతిభకు పురస్కారం



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందిస్తున్న జడ్పీ ఛైర్మెన్

జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న బాలికలలో మొదటి మరియు రెండవ శ్రేణిని సాధించిన వారికి కోరమాండల్ ఫెర్టిలైజర్ వారు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. ఈ నెల 10వ తేదీన జరిగిన సిఎస్‌ఆర్ ఫండ్ క్రింద కోరమాండల్ వారి గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కార కార్యక్రమంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పాల్గొని బాలికలకు నగదు మరియు సర్టిఫికేట్లను అందజేశారు.

# విద్యార్థినులను అభినందించిన కలెక్టర్



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరుజిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఈ నెల 12న తన ఛాంబర్‌లో నాసా అంతరిక్ష కేంద్ర సందర్శనకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. నెల్లూరుజిల్లా తడలోని కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.చెంచులావణ్య, వెంకటగిరి కేజీబీవీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వి.అశ్విని నాసా అంతరిక్ష కేంద్రం సందర్శనకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థినుల సర్వశిక్షా అభియాన్ పివో విశ్వనాథ్ ఇతర అధికారుల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసారు. జిల్లా కలెక్టర్ విద్యార్థినులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసు కోవాలన్నారు. మెరుగైన ప్రతిభను కనబరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.




## శుభాభినందనలు

సేవాగుణ సంపన్నుడు, అభినవ దానకర్ణుడు
మంచితనం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి
**శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు**
రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన శుభసందర్భంగా
మా హృదయపూర్వక శుభాభినందనలు.



శ్రీకంటి రామ్మోహన్‌రావు
గౌరవాధ్యక్షులు



యరగుడిపాటి చలపతిరావు
అధ్యక్షులు



ఆనిమెళ్ళ శివకుమార్
ఉపాధ్యక్షులు



జి.కె.నాథబ్రహ్మం
ఉపాధ్యక్షులు



చిట్టమూరు శ్రీనివాసరావు
కార్యదర్శి



శ్రీరామకవచం శ్రావణ్‌కుమార్
ట్రెజరర్

ఎగ్జిక్యూటివ్ కమిటి మెంబర్లు మరియు యువజన విభాగం
ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య - గూడూరు శాఖ


# వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయము

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.

ఆర్.ఓ.సి.నెం.1/2018 | తేది.09.03.2018

## టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వింజమూరు మండలం, వింజమూరు గ్రామ పంచాయితి 2018-2019వ ఆర్థిక సంవత్సరమునకు ఈ క్రింద కనుపరచిన వస్తువులు దఫాలవారీగా సరఫరా చేయుటకు తే.24-03-2018ది శనివారము ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు సాయంత్రం 4గంటలకు టెండరుదార్లు సమక్షములో టెండర్లు తెరువబడును. ఇతర వివరములు గ్రామ పంచాయతి కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | వివరములు | ధరావత్తు రూ. |
|---|---|---|
| 1. | 2018-2019 సంవత్సరమునకు పి.డబ్ల్యు.ఎస్. సామాన్లు, విడిభాగములు సరఫరా చేయుట | 1000.00 |
| 2. | 2018-2019 సంవత్సరమునకు వీధి విద్యుత్ దీపములు విడిభాగములు సరఫరా చేయుట | 1000.00 |
| 3. | 2018-2019 సంవత్సరమునకు క్రిమి నివారణ మందులు (బ్లీచింగ్, సున్నము మరియు ఫినాయిల్) సరఫరా చేయుట | 1000.00 |
| 4. | 2018-2019 సంవత్సరమునకు పి.డబ్ల్యు.యస్‌కు చెందిన మోటార్లు, పంపులు, స్టార్టర్లు మరియు ఇతరములు మరమ్మత్తులు చేయుటకు | 500.00 |
| 5. | 2018-2019 సంవత్సరమునకు అవసరమగు ఎల్.ఎఫ్.బుక్స్ అండ్ ఫారాలు సరఫరా చేయుట | 500.00 |
| 6. | 2018-2019 సంవత్సరమునకు అవసరమగు పారిశుద్ధ్య సామానులు అనగా చీపుర్లు, కాలువ పారలు, బ్రషులు, చెలగపారలు వగైరాలు సరఫరా చేయుట | 500.00 |
| 7. | 2018-2019 సంవత్సరమునకు అవసరమగు ఎల్.ఎఫ్.బుక్స్ అండ్ ఫారాలు సరఫరా చేయుట | 500.00 |

గమనిక: ఎ) టెండర్లనకు సంబంధించిన షెడ్యూలు ఫారములు ముందుగా ఫారము ఒకటికి రూ.50/-లు చెల్లించి గ్రామ పంచాయతి కార్యాలయము నందు పొందవలయును.
బి) అనివార్య కారణముల వలన ప్రభుత్వము వారు టెండరు నిర్వహించు తేదీని సెలవు దినముగా ప్రకటించిన మరుసటి రోజు టెండర్లు నిర్వహించబడును.
సి) టెండర్లు పాక్షికముగా గానీ, పూర్తిగా గానీ రద్దు పరచుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

**సం/- కె.రామారావు**
**పంచాయతీ కార్యదర్శి, వింజమూరు గ్రామపంచాయతి**
**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.**

# వణికిస్తున్న సైకో

## ఆందోళనలో నెల్లూరు జనం



ప్రజలకు ఏ భయం పట్టుకుంటే ఆ భయం కొద్ది రోజుల పాటు వెంటాడుతూనే వుంటుంది. ఒకచోట దొంగతనం జరిగితే ఎవరిని చూసినా దొంగలను చూసినట్లే చూస్తారు. ఒకచోట చైన్ స్నాచింగ్ జరిగితే... ఎవరిని చూసినా చైన్ స్నాచర్‌లు మాదిరిగానే కనిపిస్తారు... అలాంటిదే ఇప్పుడు 'సైకో' భయం.

ఇటీవల కోవూరు పట్టణంలో ఒక సైకో ఉన్నట్లుండి దాడి చేయడం వంటి సంఘటనల ద్వారా ఎనిమిది మందిని గాయపరిచాడు. దాడి చేసి గాయపరచడం... పారిపోవడం చేస్తున్నాడు. పోలీసులు 'సైకో' కోసం జల్లెడ పట్టి గాలిస్తున్నారు. అయినా దొరకలేదు. ఈలోపు 'సైకో' జ్వరం జిల్లా అంతటా పాకింది. ఈ జిల్లాలోని అన్ని పట్టణాలు, ఆఖరకు గ్రామాలలో కూడా 'సైకో' భయం నెలకొంది. ఆడవాళ్ళు ఒంటరిగా పోవాలంటే భయపడుతున్నారు. పసివాళ్ళు బయట ఆడుకోవాలంటే జంకుతున్నారు. వీధుల్లో చెత్త ఎరుకునేవాళ్ళను చూసినా, భిక్షమెత్తుకునే వాళ్ళను చూసినా... వీళ్ళేమన్నా 'సైకో'లా అనే ఫీలింగ్. ఈమధ్య కోవూరులో ఇదే ఫీలింగ్‌తో స్థానికులు మతిస్థిమితం లేని ఓ వ్యక్తిని పట్టుకుని చావగొట్టారు. మొన్న నెల్లూరు శ్రీహరినగర్‌లో ఒంటి మీద గుడ్డలు లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని చూసి ఓ మహిళ 'సైకో సైకో' అంటూ భయంతో కేకలు వేయడంతో అతను పారిపోయాడు. స్థానికులు, పోలీసులు కలిసి ఆ అజ్ఞాత వ్యక్తి కోసం గాలించారు.

పాతికేళ్ళ క్రితం నెల్లూరు జిల్లాలో ఓ పుకారు వ్యాపించింది. ఒక స్త్రీ వచ్చి అర్థరాత్రిళ్ళు తలుపు కొడుతుందని, తలుపు తీసి ఆమెను చూస్తే 'నెత్తురు' కక్కుకుని చనిపోతున్నారని... అప్పుడు ఈ భయంతోనే గ్రామాల్లో ప్రతి ఒక్కరి ఇంటి ముందు 'ఓ స్త్రీ రేపు రా' అంటూ రంగులతో వ్రాసేవాళ్ళు. అలాంటి వాతావరణమే ఇప్పుడు జిల్లాలో 'సైకో' మూలంగా నెలకొంది. వీలైనంత తొందరగా సైకోను పట్టుకుంటే గాని ఈ భయం నుండి జనం బయటపడరు.

# రామభక్తితో పులకించిన ఈదూరు


### శ్రీ కోదండరామస్వామి - శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో నూతన శిలాబింబ, విమాన శిఖర ప్రతిష్ఠ



తోటపల్లి గూడూరు మండలంలోని ఈదూరు గ్రామం శ్రీరామునిపై ఎనలేని భక్తిశ్రద్ధలతో పులకించిపోయింది. పెద్ద పెట్టున శ్రీరామ నామం మారుమ్రోగుతుండగా, శ్రీరామ నామ స్మరణలతో ఆ గ్రామం తరించిపోయింది. ఈదూరులో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 8వ తేదీన ఎంతో వైభవంగా నూతన శిలాబింబ, విమాన శిఖర ప్రతిష్ఠ జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు వెల్లువగా తరలివచ్చి శ్రీ కోదండరామస్వామిని, శ్రీ అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. శ్రీ శబరి శ్రీరామ క్షేత్రం ప్రధాన అర్చకులు, ఆగమశాస్త్ర పండితుడు భావనాచార్యుల నేతృత్వంలో, రావి మోహన్‌చౌదరి ఆధ్వర్యంలో, శ్రీరామభక్తబృందం పర్యవేక్షణలో దేవస్థానంలో నూతన శిలాబింబ ప్రతిష్ట, విమాన శిఖర ప్రతిష్ట తదితర కార్యక్రమాలన్నీ ఎంతో కన్నులపండువగా జరిగాయి. తొలుత ఆలయంలో 5వ తేది సాయంత్రం 6గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మృత్సం గ్రహణం చేసి ఈ వేడుకలకు అంకురార్పణ గావించారు. 6న అగ్ని ప్రతిష్ట, 7న కలశస్థాపన, శాంతిహోమాలు, యాగ కార్యక్రమాలు నిర్వహించి నేత్రపర్వంగా స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. 8వ తేది ఉదయం 6 గంటలకు యాగ కార్యక్రమాలు, 7 గంటలకు రత్నన్యాసం జరిగాయి. అనంతరం, 7.40-7.44 గంటల మధ్య సుముహూర్తంలో మంగళ వాయిద్యాల మధ్య, శ్రీరామనామస్మరణల మధ్య బింబ ప్రతిష్ఠ, విమాన శిఖర ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఆ తర్వాత బింబ కళాన్యాసం, ప్రార్ణాహుతి, కుంభాభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా వైఖానసాగమోక్తంగా త్రయాహ్నిక దీక్షతో శ్రీ కోదండరామస్వామి వారికి, శ్రీ అభ యాంజనేయ స్వామివారికి అంగరంగవైభవంగా మహాకుంభాభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత శాంతి కల్యాణం, ఆశీర్వచనం జరిగాయి. మధ్యాహ్నం 12.30గంటలకు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కలికి కోదండరామిరెడ్డి, కనుపూరు ముత్యాలమ్మ ఆలయం మాజీ ఛైర్మెన్ మురళీమోహన్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, డెయిరీ మాజీ ఛైర్మెన్ గోపాల కృష్ణచౌదరి, డా. కృష్ణ కిషోర్, సత్యంజీ, ట్రస్టీ రామచంద్ర నాయుడు, సుధాకర చౌదరి, రమేష్‌బాబు, బాబునాయుడు, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వెంకయ్య నాయుడు, శేఖర్, శ్రీధర్‌రెడ్డి, రమణయ్య, భూపేంద్ర, శ్రీరామ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.



ఝటుఝటుఝ

# విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలతో...



## పేదల గూడుకు చంద్రబాబు తోడు:

నెల్లూరు నగరంలోని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ఆశీస్సులతో మంత్రి నారాయణ గారి ఆధ్వర్యంలో అర్బన్ హౌసింగ్ పథకం తీసుకొచ్చి 58వేల గృహాలు నిర్మించి పేదవాని కలల సాకారం చేసే దిశగా చర్యలు చేపట్టారు. ఈ లబ్ధిదారులు చెల్లించాల్సిన వాటా రూ.500ను తానే చెల్లిస్తానని మంత్రి నారాయణ ముందుకొచ్చి కోటిన్నర రూపాయలు వితరణను ప్రకటించారు. షీర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్ళను నిర్మిస్తున్నారు.



## తాగునీటి సరఫరా మరియు భూగర్భ డ్రైనేజీ:

6లక్షల జనాభా ఉన్న సింహపురి ప్రజలు తాగునీటి కోసం ఎన్నో అవస్థలు పడేవారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా సోమశిల జలాలను సంగం నుంచి నెల్లూరుకు తరలించేందుకు రూ.550 కోట్లతో ప్రత్యేక తాగునీటి వ్యవస్థ మంజూరు చేయించారు. దినదినాభి వృద్ధి చెందుతున్న నెల్లూరు నగరంలో సరైన మురుగునీటి వ్యవస్థ లేదు. చినుకు పడితే రోడ్లపైనే మురుగునీరు, దీని కోసం రూ.550 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను తీసుకొచ్చి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నగరంలో పెద్దఎత్తున పనులు చేపట్టారు.



## బ్యారేజీల నిర్మాణం:

ఎన్నో ఏళ్ళ నుంచి పెండింగ్‌లో ఉన్న నెల్లూరు, సంగం బ్యారేజీ పనులను ఈ ఏడాది పూర్తి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. నెల్లూరు బ్యారేజీ పూర్తయితే నెల్లూరు నగరంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చు. అలాగే నెల్లూరు, సంగం బ్యారేజీల పరిధిలో ఆయకట్టుకు సమగ్ర పంటలకు సాగునీటిని అందించవచ్చు.




## మున్సిపల్ జూనియర్ కళాశాల:

ప్రభుత్వ హైస్కూళ్ళలో 10వ తరగతి చదివిన నిరుపేద విద్యార్థుల కోసం నెల్లూరు కార్పొరేషన్ పర్యవేక్షణలో జూనియర్ కళాశాలను నెలకొల్పారు. నారాయణ విద్యా సంస్థల సహకారంతో ఐ.ఐ.టి ఓరియంటేషన్ విద్యతో మెడిసిన్, ఇంజనీరింగ్ విద్యార్థులుగా తీర్చిదిద్దడం కోసం కార్పొరేట్ స్థాయిలో బోధన జరుగుతుంది. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా 50మంది పేద విద్యార్థులకు ప్రవేశం కల్పించి కార్పొరేట్ విద్యనందిస్తున్నారు.




## ప్రీ స్కూల్‌గా అంగన్‌వాడీలు:

పేద పిల్లలు నర్సరి విద్యను అభ్యసించే అంగన్‌వాడీల స్వరూపం మార్చి, ప్రీ స్కూల్స్‌గా అభివృద్ధి చేశారు. బోధనకు అవసరమైన సామాగ్రిని నారాయణ విద్యాసంస్థల సహకారంతో అందిస్తూ పిల్లలకు యూనిఫామ్, టీచర్లకు డ్రెస్‌కోడ్ అమలు చేస్తూ కార్పొరేట్ స్థాయిలో బోధన అందజేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థినీవిద్యార్థులందరికీ డెస్కులు ఏర్పాటు చేయించారు.





## స్మార్ట్ సిటిగా నెల్లూరు:

స్మార్ట్ సిటిగా నెల్లూరును ఎంపిక చేయించి రాష్ట్ర స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు సాగిస్తున్నారు. నెల్లూరు నగరం సుందరీకరణ, టూరిజం హబ్‌గా బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువును మిని ట్యాంక్‌బండ్‌లా రూపొందించడం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. నగరానికి ఎల్.ఇ.డి వెలుగులు దిద్దారు. నగరంలోని ఎస్.సి, ఎస్.టి కాలనీలలో రూ.100 కోట్లకుపైగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.



నెల్లూరు నగరాభివృద్ధి ప్రధాత...
పేదల గూడుకు నేనున్నానని తోడుగా నిలచిన పేదల పక్షపాతి...
నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తున్న విద్యావేత్త...
సోమశిల జలాలతో శాశ్వతంగా నగర ప్రజల
దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్న అపర భగీరధుడు...
సింహపురిని సుందరీకరణ నగరిగా తీర్చిదిద్దేందుకు అవిరామ కృషి చేస్తూ...
రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు
**మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి**
అడుగుజాడల్లో నడుస్తూ...
నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ...
పేదల కష్టాలు, కన్నీళ్ళు తుడుస్తూ...
ప్రతి ఒక్కరికి నేనున్నానని భరోసా కల్పిస్తున్న
శుభతరుణంలో అందరికీ
విళంబి నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలు.





# మన నెల్లూరు
# మన నారాయణ

# విళంబి పంచాంగము



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

జ్యోతిశ్శాస్త్రమునందు లోక వ్యవహారము కొరకు మన దేశమున చంద్ర సూర్య బృహస్పతి మానవులను మూడుగా ప్రధానముగా విభజించారు. తిరుమలగిరికి దక్షిణ ప్రాంతము సౌరమానమని, తిరుమల గిరి-వింధ్య పర్వతముల మధ్య ప్రాంతమును చాంద్ర మానమని, వింధ్య పర్వతములకు ఉత్తర ప్రాంతము బార్హస్పత్యమానమని ప్రచారములోనున్నది. చాంద్ర, సౌరమానముల వారికి విళంబి నామ సంవత్సరము జరుగుతుంది. బార్హస్పత్యమానము వారికి విరోధికృత్ నామ సంవత్సరము జరుగుతుంది.

ప్రభవాది అరవై సంవత్సరములలో 32వది విళంబి నామ సంవత్సరము. యుగమనగా సంవత్సరము(కాలము). యుగము యొక్క ఆది అనగా ప్రారంభము 'యుగాది' అయినది. వ్యవహారములో 'ఉగాది'గా పిలవబడుతున్నది. ఉగాదినాడు వారి వారి వర్ణాచారముల ప్రకారము మంగళస్నానము చేసి, దైవాన్ని చిత్తశుద్ధితో ఆరాధించి, షడ్రుచులు కల వేప ప్రసాదాన్ని స్వీకరించి పంచాంగ విషయాన్ని తెలుసుకొనవలసి ఉంటుంది. పంచాంగ ఎందుకు వినటం.. తెలిసికొనడం జరగాలంటే..

*శ్రీ కల్యాణ గుణావహం రిపుహరం*
*దుస్స్వప్నదోషాపహం*
*గంగాస్నాన వివేష పుణ్యఫలదం*
*గోదాన తుల్యం నృణాం*
*ఆయుర్వృద్ధిద ముత్తమం శుభకరం*
*సంతాన సంపత్ప్రదమ్*
*నానాకర్మ సుసాధనం సముచితాం*
*పంచాంగ మాకర్ణ్యతాం.*

### విళంబి సంవత్సర ఫలితము :

విషమ బుద్ధులు, దుష్ట ప్రవర్తనలు దేశమంతటా విస్తరించును. ఉపద్రవములు, ప్రాణనష్టము ఎక్కువగా నుండును. సస్యరక్షణలో ధాన్యరక్షణలో ఇబ్బందులుండును. జనంలో రోగబాధితుల సంఖ్య పెరుగుతుంది. ధరలు సూచీ పెరుగును. జీవనం కొరకు జనులు విదేశ, దేశములందు సంచరించెదరు. ప్రభుత్వముల మధ్య వైషమ్యములు పెరుగును. సంపద దోపిడీ పెరుగును. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందును.

### బార్హస్పత్యమాన విరోధికృత్ సంవత్సర ఫలితములు:

ప్రజావైరుధ్యము పెరుగును. అతివృష్టి బాధలు, వాహన ప్రమాదములుండను. పంటలు సుమారుగా పండును. కేంద్రప్రభుత్వముపై ప్రజల ఆదరణ తగ్గను. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందును. ఎండల తీవ్రత పెరుగును.

### నవనాయక ఫలితములు :

ప్రతి సంవత్సరము నవనాయకులని, 21 మంది ఉపనాయకులను పిలవబడుతూ గ్రహములు కాలానికి శుభాశుభ పలితములనిస్తాయి. చైత్ర శుక్ల పాఢ్యమి వారాధిపతి రాజు, రవి మేషరాశి ప్రవేశ వారాధిపతి మంత్రి, రవి సింహరాశి ప్రవేశ వారాధిపతి సేనాధిపతి, రవి కర్కాటక సంక్రమణ ప్రవేశ వారాధిపతి సస్యాధిపతి, ధనుర్మాస ప్రవేశ వారాధిపతి ధాన్యాధిపతి, మిధున సంక్రమణ ప్రవేశ వారాధిపతి అర్ఘాధిపతి, ఆర్ద్రకార్తె ప్రవేశ వారాధిపతి మేఘాధిపతి, తులా ప్రవేశ సమయమ వారాధిపతి రసాధిపతి, మకర ప్రవేశ వారాధిపతి నీరసాధిపతి అని నవనాయకులు. సహాయకులైన 21 మంది ఉపనాయకులని పిలవబడుతారు. ముందుగా ఫలితాలు చూస్తూ ఈ విధంగా ఉన్నాయి.



### రాజు-రవి :

ప్రభువులకు పరస్పర విరోధము, అల్పవృద్ధి, ప్రజలకు ప్రభుత్వ వ్యక్తుల వల్ల శస్త్రముల వల్ల బాధలుండును. పంటలు తక్కువ. చోరాగ్ని బాధలు ఎక్కువ. అధికారవర్గంలో వైరుధ్యాలుంటాయి. రాజకీయ పరివర్తనలు, రాజకీయ కల్లోలములుండును. మెట్ట, మాగాణి, ధాన్యాల, రత్నాల, మణుల, కలప, ఎర్రని పదార్ధాముల నిర్మాణరంగ సామగ్రి, సుగంధ ద్రవ్యాలు, చముర్ల ధరలు పెరుగును. తీవ్రవాదులతో పోరాటములుండును. ప్రభుత్వ నేతలు ప్రజలను మభ్యపెట్టుట జరుగును.

### మంత్రి-శని :

వర్షములు తగ్గుట, పంటలు తగ్గుట, చెడు బుద్ధులు ప్రవర్తనలు పెరుగుతాయి. అధికార యంత్రాంగము వల్ల ఇబ్బందులు, కష్టములు పెరుగును. రుజుప్రవర్తన ఉండదు. ధరలు పెరుగును. ప్రభుత్వ నిర్ణయాలపై న్యాయపీఠం నుండి అభిశంసనలుండును.

### సేనాధిపతి-శుక్రుడు:

సైనిక సామర్ధ్యము బాగుండును. సైన్యమునకు ఆర్ధికసమృద్ధి, ఆయుధ సమృద్ధి బాగుండను. ఆహారధాన్యల ధరలు స్వల్పముగా పెరుగును. స్త్రీ పురుషులు కామాసక్తులై సంచరించెదరు. అప్పుడప్పుడు యుద్ధ పరిస్థితులు నెలకొని సర్దుబాటగును. వ్యాపార వాటాల ధరలు, వెండి, బంగారు ధరలు పెరిగియుండును. ప్రజలకు సైనిక సేవా సహకారములు బాగుండును.

### సస్యాధిపతి-కుజుడు:

పూర్వ సస్యాధిపతి కుజుడగుటలచే కందులు, మిర్చి, వేరుశనగ, ఎర్రని ధాన్యములు, ఎర్రనేలలు మొదలగు మెట్ట పంటలు పండును. పూల ఉత్పత్తి బాగుండును.

### ధాన్యాధిపతి-రవి :

రవి ధాన్యాధిపతి అగుటచే వర్షములు పంటలు తక్కువ. ప్రభుత్వం వత్తిడితో అదుపుచేసే పరిస్థితులుండి ధాన్యముల ధరలు సరసముగా నుండవు. మిర్చి, ఉలవలు, కందులు, వేరుశనగ బాగా పండును. కొబ్బరికాయలు, మామిడి, పనస, అరటి, నారింజ ఫలాలు బాగా పండును. వడగండ్ల వానల వల్ల పంటలు బాగా దెబ్బతినును.

### అర్ఘాధిపతి-శుక్రుడు :

ధాన్యముల వెలలు స్వల్పముగా పెరిగి స్థిర పడును. వెండి, బంగారు, ఇనుము, కలప, గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరుగును. పెట్రోలు, డీజలు, కిరోసిన్, వంటనూనెల ధరలు స్వల్పముగా పెరుగును. బియ్యం, రాగి, దూది, పొగాకు ధరలు యధాతథంగా ఉంటాయి. షేర్‌మార్కెట్ లాభదాయకముగా ఉండును.

### మేఘాధిపతి-శుక్రుడు :

దక్షిణ దేశంలో అల్పవృష్టి. ఉత్తర దేశంలో అతివృష్టి ఉండును. ధరలు సంతృప్తికరం. అల్పపీడన వాయుగుండముల వలన కొంత సంపద, స్వల్ప జననష్టం కలుగును. పశుసంపద, క్షీరసంపద బాగుండును.

### రసాధిపతి-గురువు :

నెయ్యి, పాలపదార్ధములు, బెల్లం, పంచదార, రసవస్తువులు సమృద్ధిగా నుండును. పాడిపంటలు బాగుండును. పండ్లతోటలు, పూలతోటలు బాగుగా పండును.

### నీరసాధిపతి-కుజుడు :

బంగారు, వెండి, ఎర్రచందనం, కట్టెలు, బొగ్గుల ధరలు పెరుగును. మిర్చి, పొగాకు, ఇనుము, ఉక్కు, రాగి, ఇత్తడి, కంచు యంత్ర పరికరాల ధరలు పెరుగును. గృహనిర్మాణ సామగ్రి, పరికరముల ధరలు స్వల్పముగా పెరుగును. టెక్నాలజీకి సంబంధించిన వస్తువుల ధరలు తగ్గును. విద్యుత్ ఉత్పత్తి పెరుగును.

### వర్షలగ్న జగల్లగ్నము :

వర్షలగ్నము కన్య ద్వితీయమున గురువు, చతుర్ధమున శని, కుజులు పంచమమున కేతువు, సప్తమమున రవి చంద్ర శుక్ర బుధులు, లాభమున రాహువు.

గ్రహగతుల స్థితిని పరిశీలించినచో రాష్ట్రప్రభుత్వములు రెండును బలిష్టమైన స్థితిలోనుండును. ప్రభుత్వముపై ప్రజలకు మంచి నమ్మకముండును. అయినా, ఇతర కారణాల వల్ల ప్రభుత్వము ఒడిదుడుకులనెదుర్కొని నిలబడును. కొన్ని అనుకోని సంఘటనల వల్ల ఆర్ధిక స్థితి కొంత ఇబ్బందుల నెదుర్కొనగలదు. ఇతర దేశాల తోడ్పాటు బాగుండును. వస్తునిల్వలు వృద్ధి చెందును. వ్యవసాయ రంగములో పెనుమార్పులుండును. వ్యాపార సంస్థలు, వ్యాపార వర్గముల ఆదాయము పెరుగును. చతుర్ధ శని కుజుల వలన గృహనిర్మాణ రంగము వేగముగా వృద్ధి చెందును. పర్యాటక రంగములోను, రవాణా రంగములోను సమర్ధవంతమైన పర్యవేక్షణతో ముందంజవేసి వృద్ధి పొందును. మరియు ద్వితీయ గురు, చతుర్ధ శని కుజుల వలన పాడిపరిశ్రమ పంచాయతీరాజ్, భూగర్భవనరులు అభివృద్ధి పథములో దూసుకుని పోవును. పెనుమార్పులతో విద్యారంగము వృద్ధి వేగమందుకొనును. దశమాధిపతి బుధునకు దోష గ్రహయుతి అనగా అష్టమ వ్యయాధిపతుల కలయిక వల్ల ప్రభుత్వంలో అధికారవర్గ అవినీతి బాగుండను. పంచమమునకు కేతు రాహు సంబంధము చేత సాంఘిక సంక్షేమ కళారంగాలు అంత తృప్తికరంగా ఉండవు. క్రీడారంగంలో రాష్ట్రానికి గుర్తింపు బాగుండును. దశమ భావమునకు గురు శని కుజ దృష్టి వలన పోలీస్, రక్షణ శాఖలు సమర్ధవంతముగా గుర్తింపు పొందును. నేరచరిత్ర కొంత అదుపులోనుండును. మరియు ఉద్యోగుల సంక్షేమమునకు ప్రభుత్వము శ్రద్ధ చూపును. సప్తమమున చంద్ర బుధ శుక్రులు ఉండుటవలన ప్రేమ వివాహాలు, స్త్రీలపై వేధింపులుండును. అయితే, వాణిజ్యరంగము, పెట్టుబడులు వేగముగా వృద్ధిపొందును. గురువుకు ద్వితీయస్థితి వలన దేవాదాయ శాఖ దైవ కార్యక్రమాలను బాగా నిర్వహించును. యజ్ఞయాగాదుల ప్రోత్సాహముండును. ప్రస్తుత ప్రభుత్వాలు మరొకమారు కొనసాగును.

### ఆదాయ వ్యయమలు - రాజపూజ్య అవమానములు:

| | ఆ | వ్య | రా | అ |
|---|---|---|---|---|
| మేషం | 2 | 14 | 5 | 7 |
| వృషభం | 11 | 5 | 1 | 3 |
| మిధునం | 14 | 2 | 4 | 3 |
| కర్కాటకం | 8 | 2 | 7 | 3 |
| సింహం | 11 | 11 | 3 | 6 |
| కన్య | 14 | 2 | 6 | 6 |
| తుల | 11 | 5 | 1 | 2 |
| వృశ్చికం | 2 | 14 | 5 | 2 |
| ధను: | 5 | 5 | 1 | 5 |
| మకరం | 8 | 14 | 4 | 5 |
| కుంభం | 8 | 14 | 7 | 5 |
| మీనం | 5 | 5 | 3 | 1 |

**ఆ - ఆదాయము** **వ్య - వ్యయము**
**రా - రాజపూజ్యత** **అ - అవమానములు**

జగల్లగ్నమునందు మిధున లగ్నము ద్వితీయమున రాహువు, పంచమమున గురువు, సప్తమమున శని కుజులు, అష్టమ కేతువు, దశమమున చంద్ర బుధులు, లాభమున రవి శుక్రులున్నారు. ఈ గ్రహస్థితిని పరిశీలింపగా (1) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామరస్య ధోరణిలో సహరించుకొనును. కేంద్ర ప్రభుత్వము సమర్ధవంతముగా పాలించును. (2) ప్రభుత్వ ఆదాయము పెరుగును. స్టాక్‌మార్కెట్ల వృద్ధి మెల్లగా సాగును. (3) రవాణా రంగము, పర్యాటక రంగము, రహదారుల నిర్మాణము వేగవంతమగును. ఆదాయము బాగుండను. సమాచార ప్రసార శాఖలు సమర్ధవంతంగా పనిచేస్తూ అక్రమాలను బయటకు లాగును. (4) రెవిన్యూ సంస్కరణలు, విద్యా వైజ్ఞానిక అంతరిక్ష విజ్ఞాన సంస్థలు వేగవంతముగా సాగును. (5) రక్షణ రంగములో సైనిక పాటవము పెరుగును. కవ్వింపు చర్య వల్లన ప్రజా, సైనిక నష్టములు జరుగును (7) ప్రపంచ దేశాల సహకార పొందుట, ఆర్ధిక సంస్కరణల వేగవంతమగుట జరుగును. (8) ప్రకృతి వైపరీత్యాలు ఈ సంవత్సరము దేశములోను, ప్రపంచమంతటా పెరుగును. (9) వాహన ప్రమాదాలు, తుఫాన్ల వలన నష్టాలు, అకాల వర్షముల వల్ల నష్టాలుండును. (10) ప్రస్తుత దేశ ప్రభుత్వము మరొకసారి కొనసాగును. మెజారిటీ స్వల్పముగా గలదు. (11) సేవా, కళారంగాలు, క్రీడారంగాలలో మంచి ఖ్యాతి ఉండును. (12) ప్రజాక్షేమము, దేశ ఆర్ధికాభివృద్ధి సంతృప్తికరముగ నుండును.

### తామ్రపర్ణి (భీమరధి) నది పుష్కరములు :

గురువు వృశ్చిక రాశి ప్రవేశ సమయము నుండి 12 రోజుల పటు తామ్రపర్ణి పుష్కరములు జరుగుతాయి. తేదీ. 11.10.2018 ఆశ్వీయుజ శుక్ల తదియ గురువారం రాత్రి 1.48 గంటలకు గురువు వృశ్చిక రాశి యందు ప్రవేశించును. సూర్యాస్తమయానంతరం కాబట్టి 12.10.2018 శుక్రవారం నుండి 23.10.2018 వరకు తామ్రపర్ణి పుష్కరాలు జరుగును. నదిలో సంకల్ప పూర్వకముగా స్నానమాచరించి జప తర్పణ కార్యక్రమాలు, పితృదేవతలకు పిండ ప్రదానములు చేయుటవలన పునీతులై కుటుంబ వృద్ధి పొందగలరు.

### కర్తరీ నిర్ణయము :

తేది 04.05.2018 నుండి డొల్లు కర్తరీ ప్రారంభము. తేది 11.05.2018 శుక్రవారం నుండి తేది 28.05.2018 సోమవారం వరకు నిజకర్తరి. ఈ కర్తరిలో 'మృచ్ఛిలాదారు కర్మాణి వర్జయేత్' అను ప్రమాణము వలన మట్టి, రాయి, కొయ్యతో కూడిన నిర్మాణములు పనికిరాదు.

### మౌఢ్యములు :

సూర్యునకు అత్యంత సమీపమున ఏ గ్రహము వచ్చినను అస్తంగత దోషము కలుగును. శుభ గ్రహములగు గురు శుక్రులు రవి సమీపమునకు వచ్చినచో అస్తంగతులగదురు కాబట్టి గురు శుక్ర మౌఢ్యములుగా చెప్పబడినవి. ఏ రకములైన శుభ కార్యములు కూడా చేయరాదని ధర్మశాస్త్ర, జ్యోతిశ్శాస్త్ర ప్రమాణము.

తేది 21.10.2018 ఆశ్వీయుజ శుక్ల ద్వాదశి ఆదివారము నుండి తేది 31.10.2018 ఆశ్వీయుజ బహుళ సప్తమి బుధవారం వరకు శుక్రమౌఢ్యమి జరుగును. తేది :12.11.2018 కార్తీక శుక్ల పంచమి సోమవారం నుండి తేది 10.12.2018 మార్గశీర్ష శుక్ల తదితయ సోమవారం వరకు గురుమౌఢ్యమి జరుగును.

### అధిక జ్యేష్టమాసం:

ఏ తెలుగు నెలలో శుక్ల పాఢ్యమి నుంచి అమావాస్య వరకు మధ్యలో సూర్యసంక్రమణం జరగదో, అది తరువాత నెలకు సంబంధించిన అధికమాసం అగును. ఏ రకమైన శుభముహూర్తములు అధిక మాసంలో ఉండవు.

### గ్రహణములు :

తేదీ : 27.07.2018 అషాఢపూర్ణిమ శుక్రవారం రాత్రి 11.54 గంటల నుంచి 3.49 వరకు సంపూర్ణ చంద్రగ్రహణము. ఉత్తరాషాఢ, శ్రవణ నక్షత్రముల వారు చూడరాదు. ఇది కేతుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం. భారతదేశమంతటా కనిపించును. సూర్య గ్రహణములు లేవు.

### అర్ధ్ర కార్తె ప్రవేశము:

నిజ జ్యేష్ఠ శుక్ల దశమి శుక్రవారం తేది 22.06.2018 రాత్రి 7.14 గంటలకు రవి ఆర్ద్రా ప్రవేశము. దీనివల్ల ప్రజలకు సుఖ సౌఖ్యములు, ధాన్యవృద్ధి, యుద్ధ వాతావరణము, ప్రజలకు అనారోగ్య బాధలుండును. అధికారవర్గాలు పరస్పరం విభేదాలకు కలహించుకొనుట జరుగును. దేశమంతటా వానలు సంతృప్తికరము.

### మకర సంక్రాంతి :


తేది. 14.01.2019 నవమి సోమవారం రాత్రి 1.11 గంటలకు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించును. దీనినే మకర సంక్రాంతి అని పిలుస్తారు. ఉత్తరాయణ పుణ్యకాల ప్రారంభ సమయము. కాబట్టి తేది. 15.01.2019 సంక్రాంతి పండుగ అగును.

*దక్షిణాయనగే భానౌ కలికాలే నరై: కృతమ్*
*పాపం మూర్తీభవత్సర్వం బహిర్వ్యావృత్తరాయణే*

దక్షిణాయనంలో జనులు చేసిన పాపములన్ని ఘోరం రూపంలో మకర సంక్రమణ సమయంలో సూర్యాంశ గ్రహతారులు ప్రత్యక్షమగు రూపమే మకర సంక్రాంతి పురుషరూపము. అందుకే పితృదేవతలను పూజిస్తారు.

మకర సంక్రాంతి పురుష లక్షణాలను పరిశీలిస్తే శుక్లపక్షం కాబట్టి అక్కడక్కడా క్షామపరిస్థితులు. నవమి తిథి-ఈతిబాధలు, మంగళవారం-ప్రజా దు:ఖం మరియు జననష్టం. అశ్విని నక్షత్రం-ప్రభుత్వాల మధ్య సఖ్యత తక్కువ. రాత్రి సమయం-నటులకు, రాజకీయ, సామాజిక శాస్త్రజ్ఞులకు హాని, మహోదరనామము-ఆర్ధిక దోపిడీలు, రక్తవస్త్రధారణ-రోగదాయకము, రక్తఛత్రధారణ-యుద్ధ పరిస్థితుల వల్ల ఆందోళన, వ్యాఘ్రువాహనం-అరణ్య జంతునాశనం, దక్షిణాది ప్రయాణం- ఆ దిక్కున గల దేశాలకు అరిష్టం.

# హరికథా భిక్షువుకు అరుదైన గౌరవం




- 'శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి అయ్యవారి జీవనదర్శనం' పుస్తకావిష్కరణ
- తరలివచ్చిన చాగంటి, బాలు తదితర ప్రముఖులు...పులకించిన పురమందిరం



*విఖ్యాత హరికథారాధకులు..శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారి ధర్మపత్ని శ్రీమతి శకుంతలమ్మ గారిచే పుస్తక ఆవిష్కరణం, గానగంధర్వుడు బాలూ అద్భుత వ్యాఖ్యానం, సిరివెన్నెల విశ్లేషణం, వెన్నెలకంటి ప్రియభాషణం, వరప్రసాద్‌రెడ్డి వాగ్భూషణం, శివప్రభాత్‌రెడ్డి ఆత్మీయవచనం, ఆ తర్వాత బ్రహ్మశ్రీ చాగంటి వారి ఆధ్యాత్మిక ప్రవచనం.. అన్నీ కలసి వెరసి నెల్లూరు పురమందిర ప్రాంగణం అమృత వాక్ప్రవాహంలో ఓలలాడింది. అక్షరం అక్షరం కలసి పదమైనట్లు, పదం పదం కలసి వాక్యమైనట్లు, వాక్యాలెన్నో కలసి కావ్యాలైనట్లుగా ఆ అక్షర కెరటాలన్నీ కలసి వాక్ప్రవాహమై.. ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది.. తరింపజేసింది. ఈ నెల 13న 'హరికథా భిక్షువు..శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి అయ్యవారి జీవన దర్శనం' పుస్తకావిష్కరణోత్సవం ఆద్యంతం అద్వితీయంగా..అమోఘంగా జరిగింది. ఈ అపురూప గ్రంథావిష్కరణ సభ నెల్లూరు పురమందిర ప్రాంగణంలో శ్రీ సాంబమూర్తిగారికి ప్రీతిపాత్రమైన భిక్షాటనాపూర్వక త్యాగరాజ స్మరణోత్సవాల వేదికపై జరగడం సంగీత ప్రియులందరికీ ఎంతో సంతోషదాయకమైంది.*

హరికథా భిక్షువు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారికి అరుదైన గౌరవం లభించింది. యావత్ తెలుగు జాతి గర్వించదగిన మహనీయవ్యక్తి 'జీవన గౌరవంగా, ఎంత ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరింపబడాలో..అందులోనూ నెల్లూరుకు ఏనాటికీ తరగిపోని ఘనకీర్తి తెచ్చిన 'హరికథా భిక్షువు..శ్రీపతి పండితారాధ్యుల




ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబసభ్యుల నుండి సత్కారాన్నందుకున్న చాగంటి దంపతులు

దర్శనం' ఆవిష్కరించబడింది. విశ్వవిఖ్యాతి చెందిన ఓ మహాగాయకునికి జన్మనిచ్చిన పుణ్యమూర్తి జీవిత కథ పరిపూర్ణంగా తెలుగువారి ముంగిళ్ళకు చేరింది.

నెల్లూరును మరో తిరువయ్యార్ చేసి, త్యాగరాజ కృతులతో సింహపురిని సుస్వర భక్తిగానాలతో రాగరంజితం చేసిన మహనీయుడు, సంగీతజ్ఞుడు, విఖ్యాత హరికథకుడు.. నెల్లూరు త్యాగయ్య.. మన సాంబయ్యగారి జీవితాన్ని అధ్యయనం చేసి రచించిన ఈ అద్భుత గ్రంథం ఆవిష్కరణకు సాంబమూర్తిగారి తనయుడు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, గ్రంథ రచయిత ఎమ్మెస్ సూర్యనారాయణలతో పాటు, ప్రముఖ సినీ కవులు సిరివెన్నెల, వెన్నెలకంటి, ప్రముఖ పారిశ్రామికవేత్త కెఐ వరప్రసాద్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులు విచ్చేయగా, శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారి సతీమణి, బాలూగారి మాతృమూర్తి శ్రీమతి శకుంతలమ్మ చేతుల మీదుగా ఈ గ్రంథావిష్కరణోత్సవం కన్నులపండువగా జరిగింది.

ఒక మంచి విశిష్టమైన గ్రంథం ఎంత సాంబమూర్తి అయ్యవారి జీవనదర్శనం' పుస్త కాన్ని ఎంత కమనీయంగా..ఎంత రమణీయంగా ఆవిష్కరింపబడాలో..అంత వైభవంగానూ ఈ గ్రంథం ఆవిష్కృతమై అందరి హృదయాలకు చేరువైంది. రచయిత ఎమ్మెస్ సూర్యనారాయణ ఈ గ్రంథాన్ని అద్భుతంగా రచించి ఈ సందర్భంగా అందరి ప్రశంసలందుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు శ్రీ సాంబమూర్తి గారి వైశిష్ట్యాన్ని, జీవన వైవిధ్యాన్ని, విశ్లేషించి ఆయన భక్తి తత్వాన్ని, హరికథా గానం చేసి తరించిన వైనాన్ని వివరించారు. ఈ 'జీవన దర్శనం' గ్రంథం తెలుగు జాతి ఔన్నత్యానికి దర్పణ మని కీర్తించారు.

## ఇది ఓ మహత్కార్యం

**- చాగంటి కోటేశ్వరరావు**

తమ జీవితాలను ధన్యం చేసుకునేందుకు ఆ పరమేశ్వరుని సేవకు జీవితాలను అంకితం చేస్తూ ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గాన్ని ఎన్నుకుంటారని ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. శ్రీ సాంబమూర్తి గారు శ్రీ త్యాగరాజస్వామివారిని అనుసరిస్తూ.. ఉంఛ వృత్తి ద్వారా నెల్లూరులో భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలను నిర్వహించడం ఓ మహత్కార్యంగా ఆయన అభివర్ణించారు. నెల్లూరులో ఎంతోకాలంగా జరుగుతున్న ఈ స్మరణోత్సవాలు మన సంస్కృతీ సంప్రదాయాల వైభవాన్ని అత్యద్భుతంగా చాటేవేనని, ఇవి భావితరాలకు సంగీత వైభవాన్ని అందిస్తాయని అన్నారు. శ్రీ సాంబమూర్తిగారు ప్రత్యేకించి హరికథ కళకు పట్టాభిషేకం చేసిన మహనీయులని, హరికథా గానం ద్వారా ఆయన సమాజానికి చేసిన సేవ ఎంతో గొప్పదని అన్నారు. ఆయన అకుం









రిత దీక్షకు నిదర్శనంగా సాంబమూర్తే బాలసుబ్రహ్మణ్యంగా నేడు మనందరితో కలసి తిరుగుతున్నారంటూ అందరి కరతాళధ్వనుల మధ్య అన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన ప్రముఖ సినీకవి సిరివెన్నెల సీతారామశాస్త్రి మాట్లాడుతూ, గ్రంథ రచయిత ఎమ్మెస్ సూర్యనారాయణ ఈ గ్రంథాన్ని ఎంతో పరిశోధనాత్మకంగా, ఉత్తమ స్థాయిలో రచించారని కొనియాడారు. 'జీవనదర్శనం' ఎంతో గొప్ప గ్రంథమని ప్రశంసించారు. ఈ సభను నిర్వహించిన విఖ్యాత గాయకుడు బాలూ మాట్లాడుతూ, తమ తండ్రిగారి జీవితచరిత్రను రచిస్తానని ఒక వ్యక్తి ముందుకు రావడం తనకెంతో ఆనందాన్నిచ్చిందంటూ రచయిత ఎమ్మెస్ సూర్యనారాయణను అభినందించారు. హరికథకునిగా తన తండ్రి గారు నిర్వహించిన శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాల పుణ్యఫలితంగానే తాను ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. గత 53 ఏళ్ళుగా నెల్లూరులో సంగీత వైభవాన్ని చాటుతూ నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను కొనసాగించడంలో, తన తండ్రిగారి మిత్రులైన యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రి కుమారుడు నాగదేవిప్రసాద్ కృషి ఎనలేనిదని అన్నారు. అనంతరం ఆయన గ్రంథ రచయిత ఎమ్మెస్ సూర్యనారాయణను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. శాంత బయోటెక్స్ అధినేత కెఐ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, తాను సాంబమూర్తిగారి హరికథలు చిన్నతనంలో విన్నానని, అందువల్లనే తనకు చిన్నతనంలో సంగీతం పట్ల అభిమానం కలిగిందన్నారు. ఆయన చెప్పిన 'కాళిదాసు' హరికథను ఇప్పటికీ మరచిపోలేనన్నారు. మానవత్వం పరిమళించిన మహనీయమూర్తి సాంబమూర్తిగారని కొనియాడారు. ప్రముఖ సినీకవి వెన్నెలకంటి మాట్లాడుతూ, సాంబమూర్తిగారి హరికథల్లో కాళిదాసు ఎంతో విశేషమైనదని, చిన్నతనంలో తన తల్లితో కలసి ఆ హరికథ విన్నానని అంటూ నెల్లూరు త్యాగయ్య మన సాంబయ్య అని అన్నారు. 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెస్ సూర్యనారాయణ రచించిన ఈ 'జీవనదర్శనం' పుస్తకానికి తమ వారపత్రిక 'లాయర్'లో 'ఇదీ సాంబమూర్తిగారి కథ' అనే ప్రత్యేకసంచికలో వచ్చిన అంశాలు మూలాధారం కావడం తమ కెంతో ఆనందంగా ఉందన్నారు. 'లాయర్'లో 'ఇదీ సాంబమూర్తిగారి కథ'ను ప్రత్యేక సంచికగా ప్రచురించడంతో తన జన్మ ధన్యమైందన్నారు. ఆ సంచికను 20వేల మంది సమక్షంలో ఆవిష్కరించబడడం, ఇప్పుడు సాంబమూర్తిగారి 'జీవన దర్శనం' పుస్తకావిష్కరణసభలో పాల్గొనడం ద్వారా తన జన్మ సార్థకమైందన్నారు. నగరంలో ఎంతో కాలంగా నిర్వహిస్తున్న భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజస్మరణోత్స వాల నిర్వహణకు తనవంతు సేవగా తన తండ్రి స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి ట్రస్ట్ తరఫున 10వేల రూపాయల చెక్కును ఇదే వేదికపై ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా స్మరణోత్సవాల సభ కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్‌కు అందజేశారు. అందుకు



ఎస్పీ బాలు చేతులమీదుగా చెక్కునందుకుంటున్న యనమండ్ర

ప్రేక్షకుల నుంచి స్పందించిన పర్వతరెడ్డి కోదండరామరెడ్డి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తాను కూడా త్యాగరాజ స్మరణోత్సవాల సభకు ప్రతిఏటా 5వేల రూపాయలు విరాళంగా ఇస్తామని ప్రకటించడం విశేషం. గ్రంథ రచయిత ఎమ్మెస్ సూర్యనారాయణ మాట్లాడుతూ, హరికథా భిక్షువు శ్రీ సాంబమూర్తి గారి 'జీవన దర్శనం' గ్రంథం రచించడం తన మహద్భాగ్యమన్నారు. అందుకు స్ఫూర్తి నిచ్చిన ప్రముఖ గాయకులు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు, గ్రంథ రచనకు సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా పేరుపేరునా తన కృతజ్ఞతలు తెలిపారు. తన గ్రంథానికి 'లాయర్' వారపత్రిక ప్రత్యేక సంచిక మూలాధారమంటూ, అందుకు 'లాయర్' యాజమాన్యానికి తన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా మురళీకృష్ణ హోటల్స్ సారథులు గ్రోసు గోపాలయ్య, వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత, ఈ సభకు అనివార్య కారణాల వల్ల రాలేకపోయిన ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి పంపించిన సందేశాన్ని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సెల్‌ఫోన్ ద్వారా సభికులకు వినిపించారు. ఈ పుస్తకా విష్కరణ అనంతరం ప్రవచన చక్రవర్తి బిరుదాంకితులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు త్యాగరాజ స్మరణోత్సవాలను పురస్కరించుకుని శ్రీ త్యాగరాజస్వామి రచించిన రామాయణం వైశిష్ట్యాన్ని విహంగ వీక్షణంగా గంట పాటు వివరించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలసుబ్ర హ్మణ్యం ఎంతో వినమ్రంగా శ్రీ చాగంటి కోటేశ్వరరావుకు పాదాభివందనం చేసి ఆయన ఆశీస్సులందుకున్నారు.



# వైకాపాతోనే పేదల సంక్షేమం

## - మేరిగ మురళి


సమావేశంలో మాట్లాడుతున్న మేరిగ మురళి

వైకాపా అధికారంలోకి వస్తే పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తారని ఆ పార్టీ గూడూరు నియోజక వర్గ సమన్వయకర్త మేరిగ మురళీ తెలిపారు. వైకాపా ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 12న గూడూరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీముఖ్యమంత్రి దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మురళి మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు జగన్మోహన్‌రెడ్డి పార్టీని ఏర్పాటు చేసి ఏడేళ్ళయ్యిందన్నారు. రాజన్న రాజ్యం రావాలంటే జగన్‌తోనే సాధ్యమౌతుందన్నారు. ప్రత్యేక హోదా వద్దు, ప్యాకేజీ చాలు అని నాడు బీజేపీతో కుమ్మక్కైన చంద్రబాబు నేడు ప్రజాగ్రహం గ్రహించి ప్రత్యేకహోదా కోసం పోరాడుతున్నట్లు నటించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నేదురుమల్లి పద్మనాభరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయ కుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, నాశిన నాగులు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించండి

## - చైర్‌పర్సన్ పొనకా దేవసేన


సరస్వతి పూజలో పాల్గొన్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతిఒక్క విద్యార్థి బాగా చదివి పురపాలక పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. పట్టణంలోని సిఎస్ఎం పాఠశాలలో నిర్వహించిన సరస్వతి పూజలో సోమవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్‌పర్సన్ దేవసేన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు పొందవచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పరంజ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో సరస్వతి పూజను వైభవంగా నిర్వహించారు.






# గూడూరు డివిజన్ వార్తలు

# తల్లీ ముత్యాలమ్మా.. దీవించమ్మా!



దయగల తల్లి... ముత్యాలమ్మ దీవించమ్మా అంటూ భక్తుల విన్నపాల నడుమ ముత్యాలమ్మ ఆలయం మార్మోగింది. చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో నాలుగురోజుల పాటు జరిగే జాతర మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పంబలోళ్ళ డప్పులు చప్పుడు, నెత్తిన పొంగళ్ళు, అమ్మ సన్నిధిలో మొక్కులతో మొదటిరోజు భక్తుల తాకిడి అధికమైంది. మంగళవారం రాత్రి పోలేరమ్మ నిలుపుతో ముత్యాలమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. పక్క గ్రామమైన సిద్ధవరంలో కుమ్మరి ఇంట తయారైన పోలేరమ్మ విగ్రహాన్ని మంగళవారం రాత్రి వైభవంగా ఊరేగించి తీసుకొచ్చి మెట్టినిల్లైన చాకలి ఇంట ముత్యాలమ్మ గుడికి తూర్పుదిశగా ఉన్న గంగమిట్టపై అప్పటికప్పుడు ఏర్పాటు చేసిన తాటాకుల పాకలో నిలిపారు. పంబలోళ్ళ డప్పు వాయిద్యాల మధ్య ఘటం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కోర్కెలు తీర్చాలని కోరుతూ భక్తులు వేప మండలు కట్టుకుని వేయికళ్ళ కుండలు నెత్తిన పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పొంగళ్ళు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ముత్యాలమ్మ వారు శాకాంబరిగా కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. డోలోత్సవంలో వాయిద్యకారులు లయబద్ధంగా మేళ తాళాలతో భక్తులను ఆకట్టుకొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

# డిఆర్‌డబ్ల్యూలో జాతీయ వర్క్‌షాప్

గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో మంగళవారం రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జాతీయ వర్క్‌షాపును నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సి.ఆర్.రెడ్డి తెలిపారు. సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. వర్క్‌షాపు వారం రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో కర్ణాటక విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దేవరాజన్ తంగదురయ్, కళాశాల ప్రిన్సిపాల్ భారతలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ యశోద, ప్రతినిధులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


9వ తేదీ నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన 53వ శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభలో త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న గూడూరు నెల్‌క్యాస్ట్ మేనేజర్ చెన్నూరు శ్రీనివాసరావు - మాధవిల కుమార్తె చెన్నూరు శ్రీరమ్య.




# ఆదాయం వచ్చే పనులపై ఉన్న శ్రద్ధ ఆస్థి పన్నులపై ఏదీ?



**పన్నుల వసూళ్ళలో వెనుకబడ్డ నెల్లూరు కార్పొరేషన్, మున్సిపాలిటీలు**

నెల్లూరుజిల్లాలోని మునిసిపాలిటీలు, నెల్లూరు కార్పొరేషన్ పన్నుల వసూళ్ళలో వెనుకబడి ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 14 కార్పొరేషన్లు ఉండగా పన్నుల వసూళ్ళలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ 11వ స్థానంలో వుంది. నెల్లూరు నగరపాలక సంస్థలో మొత్తం 1,17,456 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో రెసిడెన్షియల్ 75 వేలు, కమర్షియల్ 25వేలు, కాలువగట్లు, రైల్వే స్థలాల్లోని అసెస్‌మెంట్లు 11వేలు ఉన్నాయి. డబుల్ ఎంట్రీలు, నాట్‌ట్రేసింగ్ కింద మరో 5వేలు అసిస్‌మెంట్లున్నాయి. గత కొన్నేళ్ళుగా కార్పొరేషన్ పరిధిలో మొత్తం రూ.4కోట్ల పన్ను బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఈ ఏడాది రూ.33కోట్లు వసూలు చేసారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.33కోట్లు పన్నులు వసూలు చేయాల్సివుంది. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.22కోట్లు మేర పన్నులు వసూలు కావాల్సి వుంది. గూడూరు మునిసిపాలిటీలో 11659, కావలిలో 21947, సూళ్ళూరుపేటలో 9258, నాయుడుపేటలో 10170, ఆత్మకూరులో 7334, వెంకటగిరిలో 12000 అసెస్‌మెంట్లు ఉన్నాయి. దాదాపు రూ.36 కోట్లు పన్నుల వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.13కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. రెవెన్యూ అధికారులు పేద, మధ్య తరగతి ప్రజలు పన్నులు కట్టకపోతే కఠినంగా వ్యవహరిస్తున్నారు తప్ప, బడాబాబుల జోలికి వెళ్ళడం లేదు. నెల్లూరు నగరంలో ప్రముఖ హోటళ్ళు, లాడ్జీలు, కమర్షియల్ భవనాలు పెద్ద మొత్తాలలో పన్ను బకాయిలు వున్నా, వారికి రాజకీయ నాయకుల పలుకుబడి ఉండడంతో అధికారులు వారి జోలికి వెళ్ళడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నుల వసూళ్ళ గడువు ఈ నెల 31వ తేదీ నాటికి ముగియనుంది. ఉన్నతాధికారులు రెవెన్యూ వసూళ్ళ పై సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేస్తున్నారు. కాని పన్నుల వసూళ్ళలో సిబ్బంది పనితీరు సరిగా లేకపోవడంతో వెనుకబడుతున్నారు. దీంతో మునిసిపాలిటిలు అభివృద్ధిలో కుంటుపడుతున్నాయి.

# తపాలా ఉద్యోగుల ఆందోళన

తపాలా శాఖలో ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నేషనల్ ఫెడరేషన్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు 13వ తేదీ నెల్లూరులోని జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తపాలా శాఖలో ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని, జీడీఎస్ వేతన కమిటీని అమలు చేయాలని, పోస్టాఫీసులలో మౌలిక వసతులు కల్పించాలని, తపాలాశాఖ ప్రైవేటీకరణను నిలిపివేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

ఈ ఆందోళనలో ఉద్యోగుల సంఘం నాయకులు ఏ.వి.కృష్ణయ్య, ఆంథోని, సంపత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ సేవకులకు 'ఉగాది' పురస్కారాలు



ఉగాది పురస్కారాలందుకున్న సాహితీ, సామాజిక, సేవా రంగ ప్రముఖులు

సాహితీరంగంలోనూ, వివిధ రంగాల్లోనూ విశేష సేవలందిస్తున్న పలువురికి నెల్లూరులోని గుండాల లక్ష్మమ్మ, నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ విళంబి నామసంవత్సర ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 11న నెల్లూరు పొదలకూరు రోడ్డులోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న విక్రమసింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి.వీరయ్య చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాహితీరంగంలోనూ, సామాజిక సేవారంగంలోనూ విశేష ప్రతిభాపాటవాలు చాటుతున్న పలువురికి ఉగాది పురస్కారాలను అందజేయడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. ప్రముఖ కవి గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత్రి పూజిత, యోగరత్న జె.కె స్వప్న, పద్యకవి రాపూరు వెంకయ్య, ఎన్‌బికెఆర్ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య టి.మాలకొండయ్య, 'లాయర్' పత్రిక ఉప సంపాదకుడు మద్దూరు శ్రీనివాసులు, ప్రముఖ కవి మోపూరు పెంచల నరసింహం, ప్రముఖ జానపద కళాకారుడు ఓబులేశులకు ఈ పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్ర ప్రసాద్, పద్య సారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, ప్రపంచ తెలుగు సమాఖ్య ఉపాధ్యక్షులు ఎన్.బలరామయ్యనాయుడు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పొనుగోటి దేవసహాయంతో పాటు సాహితీ ప్రముఖులు గంగిశెట్టి శివకుమార్, ఈతకోట సుబ్బారావు, ప్రముఖ కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, అవ్వారు శ్రీధరబాబు, కె.నాగేంద్ర, హెచ్.మోహన్ రాజు, కవయిత్రులు సుభద్రాదేవి, తోట సులోచన, ట్రస్ట్ అడిషనల్ ట్రస్టీ కె.వసంత లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగాసనాల్లో ప్రతిభ సాధించిన దేవకి అనే చిన్నారిని జ్ఞాపికతో సత్కరించారు.

# భూమిని కాపాడుతున్నది బాబే

శ్రీను గల్పిక

అది కైలాసం. పార్వతీ పరమేశ్వరులు హాల్‌లో కూర్చుని జెమిని టీవీలో వస్తున్న 'కొడితే మొగుడినే కొట్టాలి' సీరియల్ చూస్తుంటే... వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామి మాత్రం బయట క్రికెట్ ఆడుకుంటున్నారు. పది ఓవర్లలో సుబ్రహ్మణ్యం స్వామి 90 పరుగులు తీసాడు. ఆ తర్వాత బ్యాటింగ్ వినాయకుడిది. అన్నీ సిక్సర్లే... ఏంట్రా సీన్ అని చూస్తే... సుబ్రహ్మణ్యం స్వామి వేసిన బంతులను వినాయకుడు బ్యాట్‌తో కొట్టకుండా తొండంతో పట్టుకుని గాల్లోకి విసురుతుంటే అవి బౌండరీ లైన్ అవతల పడసాగాయి. ఇలా అన్నీ సిక్సర్లే... అలా మూడు ఓవర్లకే టార్గెట్ చేధించే పరిస్థితి. స్కోర్ 85 పరుగులున్నప్పుడు సుబ్రహ్మణ్యం స్వామి వేసిన బంతిని గణపతి తొండంతో పట్టుకుని గట్టిగా విసిరాడు. ఆ బాల్ నేరుగా పోయి హాల్‌లో సీరియస్‌గా సీరియల్ చూస్తున్న శివయ్య మూడోకన్నుకు తగిలింది. అబ్బా... అంటూ బాధతో ఆయన రెండో ఆలోచన లేకుండా మూడోకన్ను తెరిచాడు. ఆయన మూడోకన్ను తెరవడాన్ని పార్వతీదేవి చూసి... స్వామీ, ఎంత పని చేశారు. మీరు మూడోకన్ను తెరిస్తే లోకమంతా ప్రళయమే కదా... నక్షత్రాలు పేలిపోవా? గ్రహాలు గుద్దుకోవా? అసలు భూమి అన్నది ఉంటుందా? భూమ్మీద జీవరాశి అంతరించిపోదా... ఈ పాటికే భూలోకం అల్లకల్లోలమై వుంటుంది. ఒక్కసారి భూలోకంలో ఏం జరుగుతుందో ఆ గూగల్ సెర్చ్ ఓపెన్ చేసి చూడండి... అని ఆదుర్దాగా చెప్పింది. అయ్యో ఎంత పొరపాటు జరిగింది దేవి... భూమి నాశనాన్ని ఆపడం ఇక ఎవరి తరమూ కాదే అంటూ తన ల్యాప్‌టాప్ తీసి గూగుల్ సెర్చ్‌లోకి వెళ్ళి భూగ్రహం మీద ఏం జరుగుతుందో చూడసాగారు. ఆశ్చర్యం... భూమ్మీద అంతా ప్రశాంతంగానే ఉంది. ఎలాంటి ప్రళయాలు, విలయాలు లేవు. శివుడు ఒక్క నిముషం ఆలోచనలో పడ్డాడు. తాను కన్ను తెరిస్తే ప్రళయం వస్తుందని చెప్పే ఇంతకాలం అది పనిగా మూడో కన్నును మూసిపెట్టుకున్నాను. ఆ కన్ను తెరిస్తే ఏమీ జరగని దానికి ఇంతకాలం మూసి పెట్టుకోవడమెందుకు అనుకుంటూ వెంటనే వైర్‌లెస్ సెట్ ద్వారా బ్రహ్మ, విష్ణుమూర్తిలను కైలాసానికి రావాల్సిందిగా కోరాడు.

అరగంటకల్లా వాళ్ళు కైలాసానికి వచ్చారు. ఏం మహేశ్వరా... ఎందుకు ఈ అర్జంట్ మీటింగ్ అని బ్రహ్మ అడిగాడు. అందుకు శివయ్య... ఒక్కటి చెప్పండి... నా మూడో కంటికేమన్నా పవర్ తగ్గిందా? లేక మన దైవ లోకాల కంబైన్డ్ రాజ్యాంగంలో సవరణలు ఏవన్నా జరిగాయా? నేను మూడోకన్ను తెరిస్తే ప్రళయం వచ్చి భూమి అంతమవుతుందనే ప్రచారం ఇంతవరకు వుంది. కాని, నేను ఇంతకుముందే క్రికెట్ బంతి తగిలి పొరపాటున మూడో కన్ను తెరచినా భూలోకంలో ఏ మార్పులు లేవు. అక్కడంతా ప్రశాంతంగానే ఉంది. ఎందుకిలా జరిగింది. నాకిప్పుడే తెలియాలి అంటూ ఆవేశంగా కూర్చున్నాడు. అప్పుడు విష్ణుమూర్తి కలుగజేసుకుని... అదా మీ బాధ... మీరు మీ మూడోకన్ను తెరిస్తే ప్రమాదమని ఇంతకాలం జాగ్రత్తగా వుంటున్నట్లున్నారు. కాని ఇప్పుడు మనకు అంత సీన్ లేదు. మన పవర్ అంతా కూడా భూలోకంలో కొందరు రాజకీయ నాయకులచేతుల్లోకి వెళ్ళిపోయింది. వాళ్ళ చేతుల్లోనే భూమి భవిష్యత్ వుందని చెప్పాడు. దానికి శివయ్య... అదెట్లా, నాకు అర్థం కావడం లేదని అన్నాడు. నీకు సింపుల్‌గా ఒక ఎగ్జాంపుల్ చూపిస్తాను చూడు... ఇది జస్ట్ ఇమ్మాజినేషన్ పిక్చర్ అంటూ వేలితో గాల్లో స్క్రీన్ గీసి పిక్చర్ ప్లే చేసాడు విష్ణుమూర్తి.

★★★★★

అది ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ వచ్చారు. విలేకరుల సమావేశం పెట్టారు. మోడీ మీడియాతో మాట్లాడుతూ... 2014లో జరిగిన విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది. మేము అధికారంలోకి వస్తే పదేళ్ళపాటూ ఏపికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పాము... ఆ మాటకు కట్టుబడే ఏపికి ప్రత్యేకహోదా ఇస్తున్నామని చెప్పాడు.

★★★★★

ప్రపంచంలోని పాతిక టాప్ సిటీలను మిక్సీలో వేసి తీసిన అమరావతి నగరమది. ఉండవల్లిలోని హైటెక్‌రత్న, ఆంధ్ర సిఎం చంద్రబాబు నివాసం. ఆయనతో పాటు మంత్రులు పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కె.ఇ.కృష్ణమూర్తి, పత్తిపాటి పుల్లారావు తదితరులున్నారు. మీడియా సమావేశం మొదలైంది. చంద్రబాబు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో రైతులకిచ్చిన ఋణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేకపోయాం... ప్రత్యేక హోదా వద్దని ప్రత్యేకప్యాకేజీకి ఒప్పుకుని తప్పు చేసాం. పోలవరం ప్రాజెక్ట్‌లో అనవసరంగా అంచనాలు పెంచాం. పుష్కరాలు, పట్టిసీమ పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగింది. ప్రతి సంవత్సరం సిఐఐ సమ్మిట్‌లు అంటూ సదస్సులు పెట్టి లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయంటూ ఊదరగొడుతున్నాం కాని అదంతా వట్టిదే... ముఖ్యంగా అమరావతి రాజధాని పేరుతో విదేశాలన్నీ తిరుగుతున్నాం, కాని అక్కడ చేసిందేమీ లేదు అని చెప్పాడు. అంతే ఒక్కసారిగా అక్కడ భూమి కదలసాగింది. చెట్లు భయంకరంగా ఊగుతున్నాయి. ఈదురు గాలులు... చెట్లు కూలుతున్నాయి... భవనాలు కదులుతున్నాయ్... సముద్రంలో సునామీ వచ్చి ఊర్లను ముంచెత్తసాగింది.

ఈ సీన్‌లన్నింటిని ఎయిర్ స్క్రీన్‌పై చూస్తున్న శివయ్య బిత్తరపోయాడు. ఏంటి ఇదంతా అని అడిగాడు. దానికి విష్ణుమూర్తి... లేటెస్ట్ సిచ్యుయేషన్ ఇదే... మోడీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నా, చంద్రబాబు నిజం మాట్లాడినా ప్రళయం వచ్చి భూమి మీద యుగాంతం జరుగుతుంది. చంద్రబాబు కేవలం భూమి మీద జీవరాశి అంతరించకూడదనే ఉద్దేశ్యంతోనే నిజాలు మాట్లాడలేకపోతున్నాడు. నువ్వు లోకం కోసం గరళాన్ని కంఠంలో దాచుకున్నట్లు ఆయన భూమి భద్రత కోసం నిజాలను కడుపులో దాచుకుని మనస్సాక్షి అంగీకరించకపోయినా అబద్దాలు మాట్లాడుతున్నాడని చెప్పి తమ లోకానికి బయలుదేరాడు.



# ఎన్‌బికెఆర్‌లో కొలోక్వియం 2-కె 18

కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో 'కొలోక్వియం 2 కె 18' జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 25 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ పరిశోధనా వ్యాసాలను అందజేశారు. పోస్టర్ల ఆవిష్కరణ ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానం కార్యక్రమంలో తిరుపతి నుంచి విచ్చేసిన మిస్టర్ ఆర్ మతివనన్ (శ్రీనివాసన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ (ప్రై.లిమిటెడ్) మాట్లాడుతూ, భావి ఇంజనీర్లు సృజనాత్మకతతో పాటుగా సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు మనదేశానికి ఉపయోగపడాలన్నారు. అలాగే భావి ఇంజనీర్లు అద్భుతాలు సృష్టించాలని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో ప్రతి ఏడాది కొలోక్వియం జాతీయసదస్సులు నిర్వహిస్తామన్నారు. పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు విచ్చేసి అధునాతన పరిశోధనలు చేసి వారి ప్రతిభను చూపుతున్నారన్నారు. కో-ఆర్డినేటర్ డా.ఎ.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ సదస్సు వల్ల పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకరి భావాలను మరొకరు పంచుకుని నూతన పరిశోధనలు చేసేందుకు పునాదులు వేసుకోవచ్చన్నారు. ప్రథమ సంవత్సరం నుంచే విద్యార్థులు ఈ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, అప్పుడే ఉన్నతస్థాయి ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విద్యార్థులతోపాటు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'విళంబి' శుభాకాంక్షలు

కం: ఆరుపదుల కొకపరి, ఈ
ధారుణి జేరుదు జనాళి దర్శింపగన్
ఆరు రుతు శోభలన్, కను
లారగ జూచుచు, పరవశమందుదు జగతిన్!

కం: విన, నను విళంబి యందురు
జనములు, అరుదగు యతిథిగ జగతికి తెలియన్
వినయ విధేయతలన్, నా
తనయులు నేర్వగ తరలితి ధారుణి వెలుగన్!

కం: తరువుల మామిడి చిగురులు
విరిసిన నింబ కుసుమములు, విశ్వము నిండెన్
మురిపెపు కోయిల పిలుపులు
కురిసెడు వెన్నెల వెలుగులు కుంభిని మెరయన్!

తే.గీ: పుష్ప ఫల శోభల పుడమి పులకరింప
తెలుగు వారిండ్లు షడ్రుచుల్ తేజరిల్ల
దినకర కిరణపుంజముల్ దీప్తి నొసగ
సమత మమతలు మైత్రితో సాగుచుండ

తే.గీ: నలువకు, శివకేశవులకు తలను వంచి
అష్టలక్ష్ముల దీవెనలందుకొనుచు
ప్రకృతి, పురుషులు పులకించి పరవశింప
అవని కరుదెంతు, ఆశీస్సులందజేతు!

- వనం సుబ్రహ్మణ్యం
చినపడుగుపాడు, ఫోన్:94415 94897

## కాలధర్మం

## చెన్నూరు మునిసుబ్బారెడ్డి



టి.వి.9 నెల్లూరుజిల్లా స్టాఫ్ రిపోర్టర్ చెన్నూరు మురళిరెడ్డి తండ్రి చెన్నూరు మునిసుబ్బారెడ్డి ఈ నెల 10వ తేదీ తన స్వగ్రామమైన డి.వి.సత్రం మండలం తనయాలి గ్రామంలో స్వర్గస్తులయ్యారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. ఆయనకు ఒక కొడుకు మురళి, మరో కుమార్తె వున్నారు. శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో భరద్వాజ సేవా సంఘం వారు ఆయన నేత్రాలను స్వీకరించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# పక్షవాతానికి అరుదైన చికిత్స



వివరాలను వెల్లడిస్తున్న డా. యుగంధర్‌రెడ్డి

నెల్లూరు పొగతోటలోని అశ్విని న్యూరో సూపర్ స్పెషాలిటీ సెంటర్‌లో పక్షవాతానికి గురైన వ్యక్తికి అరుదైన చికిత్సను అందజేసి మామూలు స్థితికి తీసుకువచ్చారు. న్యూరాలజిస్ట్ యుగంధర్‌రెడ్డి ఆ వివరాలను వెల్లడించారు. నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్ పేటలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు సుధాకిరణ్(35)కు ఈ నెల 3న ఉదయం రెండుకాళ్ళు చచ్చుబడి పక్షవాతానికి లోనవగా, వెంటనే చికిత్స నిమిత్తం అశ్విని న్యూరో సూపర్‌స్పెషాలిటీ సెంటర్‌కు తీసుకువచ్చారు. సుధాకిరణ్‌ను పరీక్షించి ఎడమ వైపు మెదడులో రక్తం గడ్డకట్టిన విషయాన్ని గుర్తించి జిల్లాలో తొలిసారిగా రూ.29వేలు విలువైన 'టెనెక్ట్ ప్లేజ్' ఇంజక్షన్ ఇచ్చి మెదడులోని గడ్డ కట్టిన రక్తాన్ని కరిగించామని, ఎవరైనా పక్షవాతానికి గురైతే 3గంటలలోగా ఆసుపత్రికి తీసుకొస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

# గర్జించిన గబ్బర్‌సింగ్

(మొదటి పేజీ తరువాయి)

నాలుగేళ్ళుగా రాష్ట్ర ప్రజలు గాని, రాజకీయ విజ్ఞులు గాని పవన్ కళ్యాణ్‌ను ఒకే కోణంలో చూస్తున్నారు. ఆయన చంద్రబాబు మనిషి... ఆయన ఎలా చెబితే అలా నడుచుకునే నాయకుడు. చంద్రబాబుకు నొప్పి తెలియకుండా ఆయన బాధను పంచుకునే పార్టనర్... ఈ అభిప్రాయాలు కలగడానికి కారణాలు లేకపోలేదు. 2014 ఎన్నికల్లో ఆయన బీజేపీ, టీడీపీల తరఫున ప్రచారం చేసాడు. ఆ రెండు పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత నాదేనన్నాడు. వాళ్ళు మాట తప్పితే ప్రశ్నిస్తానని హామీ ఇచ్చాడు.

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాయి. ఇచ్చిన హామీలను రెండు పార్టీలు కూడా తుంగలో తొక్కాయి. ప్రత్యేకహోదా ఇవ్వమని చెప్పాక పవన్‌కళ్యాణ్ నాలుగు చోట్ల మీటింగ్‌లు పెట్టి బీజేపీ మీద విమర్శలు చేసాడు. అంతవరకు బాగానే వుంది. నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఎన్నో అవినీతి అక్రమాలు జరిగాయి. అరాచకాలు జరిగాయి. పుష్కరాలు, పట్టిసీమ పేరుతో దోపిడీ, పోలవరం పేరుతో అవినీతి, అమరావతి రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం, సెజ్‌ల పేరుతో పచ్చని పైర్లు పండే పొలాలు లాక్కోవడం, దళితులపై దాడులు, అధికారులపై దౌర్జన్యం, ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనడం... ఇవేనా ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన రైతు ఋణమాఫీతో పాటు ఏ ఒక్క హామీని సవ్యంగా అమలు చేయ లేదు.

ఒక విధంగా చెప్పాలంటే ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల లోనూ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఇన్ని ప్రభుత్వ వైఫల్యాలున్నా పవన్ కళ్యాణ్ ఈ నాలుగేళ్లలో ఏరోజూ, ఏ సభలోనూ ప్రశ్నించిన దాఖలాలు లేవు.

మరి నాలుగేళ్ల తర్వాత ఆయనకు జ్ఞానోదయమైందో, లేక జెఎఫ్‌సి ద్వారా పరిచయమైన ఉండవల్లి అరుణ్‌కుమార్ లాంటి వారి హితబోధలు పని చేసాయో ఏమో గాని 14వ తేదీ గుంటూరు సభలో తెలుగుదేశం ప్రభుత్వంపై విమర్శలు గురిపెట్టాడు. చంద్రబాబు, లోకేష్‌ల అవినీతిని ఎండగట్టాడు. తెలుగుదేశం ఎమ్మెల్యేల దౌర్జన్యాలను ప్రశ్నించాడు. నాలుగేళ్లలో తొలిసారిగా తెలుగుదేశంపై ఆయన ఘాటుగా మాట్లాడాడు. రాష్ట్రంలో తెలుగుదేశం నాయకులు బరితెగించారు, 2019 ఎన్నికల్లో వైసిపిని ఎదుర్కోవడానికి నియోజకవర్గానికి పాతిక కోట్లు సిద్ధం చేసామంటున్నారు. ఎంత బరితెగించి అవినీతికి పాల్పడకపోతే ఇన్నేసి కోట్లు పోగేస్తారు. శేఖర్‌రెడ్డి కేసులో నారా లోకేష్ పేరుంది. కాబట్టే నరేంద్ర మోడీకి చంద్రబాబు భయపడుతున్నాడు. చంద్రబాబు మీద ఎన్నో అభియోగాలొచ్చాయి. పుంద మీద కారం చల్లడం ఎందుకని నేను ఇంత కాలం ఊరుకున్నాను, ఇక నుండి తెలుగుదేశం అవినీతిని ఎండగడతా అంటూ ఆయన నిప్పులు చెరిగాడు.

తెలుగుదేశం పార్టీకి పవన్‌కళ్యాణ్ పంచ్‌లు రివర్స్ షాకే! గుంటూరు వద్ద కొన్నిరోజుల క్రితమే పవన్ కళ్యాణ్ రెండెకరాలలో సొంత ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసాడు. చంద్రబాబుతో ప్యాకేజీలో భాగంగానే ఈ రెండెకరాల స్థలం ఇచ్చారని సోషల్ మీడియాలో వ్యాఖ్యానాలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈలోపే షాకిచ్చే విధంగా పవన్ మాట్లాడాడు.

నాలుగేళ్ళ క్రితం చేయాల్సిన పని పవన్ ఇప్పుడు చేసాడు. 2019 ఎన్నికల్లో టీడీపీతో పవన్ పొత్తు ఉండదన్నది జగమెరిగిన సత్యమే. ఈసారి తెలుగుదేశంకు ఓట్లేయండని పవన్ చెప్పినా ఓట్లు పడవు. జనసేన విడిగా పోటీ చేస్తేనే టీడీపీకి లాభం. అంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటును పవన్ చీలుస్తాడనే నమ్మకముంది. వ్యతిరేక ఓటు జగన్‌కు పోకుండా పవన్‌కు డైవర్ట్ చేసే వ్యూహం కూడా వుండొచ్చు. చంద్రబాబుపై బలంగా విమర్శలు చేస్తేనే జనం పవన్‌ను నమ్ముతారు. ఇద్దరి మధ్య ప్యాకేజీ ఒప్పందాలలో ఇది కూడా ఒక భాగమై వుండొచ్చని అనుమానించేవాళ్ళు ఉన్నారు.

వారి అంతర్గత విషయాలు ఎలా వున్నా నాలుగేళ్లలో మొదటిసారి పవన్ కళ్యాణ్ ప్రజల తరఫున మాట్లాడాడు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు. నాలుగేళ్ళుగా ప్రజలు ఆయన నుండి కోరుకుంటున్నది ఇదే! కాకపోతే ఈ నాలుగేళ్లలో జరగాల్సిన అవినీతి, అక్రమాలన్నీ జరిగిపోయాయి. ఇప్పుడు ఏ.పి ప్రజల చేతులు కాలాకా పవన్ ఆకుల కోసం పరుగెత్తి ఏం లాభం?

# కలిసేదెవరు? కలబడేదెవరు?

(మొదటి పేజీ తరువాయి)

ఏపి, తెలంగాణలోనూ టీడీపీతో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే ఎన్నికలకు వెళ్ళాలని ఆనాడు ఇరు రాష్ట్రాల బీజేపీ నాయకులు భావించారు. కాని, చంద్రబాబు నాయుడు తెలివిగా పావులు కదిపాడు. నరేంద్ర మోడీ ఇమేజ్‌ను ఎలాగైనా వాడుకోవాలనిచెప్పి తన రాజకీయ గురువు రామోజీరావు ద్వారా రిలయన్స్ అంబానిని రంగంలోకి దించి, ఢిల్లీ స్థాయిలో పైరవీలు నడిపించి ఎట్టకేలకు ఆనాడు మోడీని టీడీపీతో పొత్తుకు ఒప్పించారు. దాని ఫలితాన్ని 2014 ఎన్నికల్లో చంద్రబాబు అందుకున్నాడు. అనుభవిస్తున్నాడు.

అప్పుడు అందరి కళ్ళకు బీజేపీ ఐశ్వర్యారాయ్... అవే కళ్ళకు ఇప్పుడు కల్పనారాయ్‌లా కనిపిస్తుంది. దేశంలో నరేంద్రమోడీ వ్యతిరేక ఓటు పెరుగుతోంది. ఏపికిచ్చిన ప్రత్యేకహోదా హామీని తుంగలో తొక్కిన నేపథ్యంలో ఈ రాష్ట్రంలో అది ఇంకా ఎక్కువుగా వుంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకునే ఏ పార్టీ అయినా సరే ఓట్ల రూపంలో చాలా నష్టపోవాల్సి వుంటుంది. ప్రత్యేకహోదా ఇవ్వకపోవడంతో పాటు నోట్ల రద్దు, జిఎస్టీ వంటి అంశాలు ఈ రాష్ట్ర ప్రజల్లో బీజేపీపై వ్యతిరేకతను పెంచాయి. కాబట్టి రాష్ట్రంలో ఆ పార్టీతో ఎవరు పొత్తు పెట్టుకున్నా ఆ పార్టీపై ఈ వ్యతిరేకత పడుతుంది.

'ఓటు-నోటు' కేసు లేకుంటే చంద్రబాబు బీజేపీతో ఎప్పుడో తెగదెంపులు చేసుకుని వుండేవాడు. ఆ కేసు భయం వల్లే వారితో కలిసుంటున్నాడు. ఇప్పుడైనా జగన్ ప్రత్యేకహోదా ఉద్యమాన్ని ఉధృతం చేసాడు కాబట్టి, బీజేపీ మీద తాను కూడా ఫైట్ చేస్తున్నానని చెప్పడానికి తన ఇద్దరు కేంద్రమంత్రుల చేత రాజీనామా చేయించాడు. ఆ కేసు భయంతోనే ఇంకా ఎన్డీఏను పూర్తిగా వదిలి రాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఆ పని కూడా చేసేస్తాడు. అప్పుడు కేసుల భయం అంతగా వుండదు కదా! చంద్రబాబు బీజేపీతో తెంచుకోవడానికి ఇప్పుడు ఇంకా ఎక్కువ శ్రద్ధ చూపుతాడు. ఎందుకంటే మొన్న యూపి ఉప ఎన్నికల్లో బీజేపీకి కంచుకోటల్లాంటి రెండు లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. బీజేపీపై ప్రజా వ్యతిరేకతకు ఈ ఫలితాలు నిదర్శనం. కాబట్టి బీజేపీతో కలిసి పయనించడానికి ఇక చంద్రబాబు సాహసం చేయకపోవచ్చు.


టీడీపీ వదిలేస్తే బీజేపీని వైసిపి తగులుకుంటుందని చాలాకాలం నుండి ఊహాగానాలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏపిలో బీజేపీతో పొత్తు పెట్టుకోవడమంటే దారినపోయే దరిద్రాన్ని కేకేసి పిలవడమే! జగన్ అలాంటి పని చేయడు. అదీగాక ముస్లింలు, క్రిస్టియన్‌లే వైసిపికి పెద్ద ఓటుబ్యాంక్. ఎన్నికలకు ముందే బీజేపీతో పొత్తు పెట్టుకుంటే ఆ ఓటు బ్యాంకులో కొంత నష్టం తప్పదు. కాని జగన్ ప్రత్యేక హోదాను ఎవరైతే ఇస్తారో వారికి మద్దతు తెలుపుతామని ప్రకటించివున్నాడు. అది ఎన్నికల తర్వాత కావచ్చు... లేదంటే ఎన్నికల ముందు కూడా కావచ్చు. అయితే వైసిపితో పొత్తు కోరుకుంటే ఎన్నికలలోపే కేంద్రం ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చే అవకాశం వుంది. జగన్ పోరాటం వల్లే మేం దిగొచ్చి ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చామని కేంద్రం ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అప్పుడు బీజేపీతో వైసిపి పొత్తు పెట్టుకున్నా ఇబ్బంది ఉండదు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చినందు వల్లే బీజేపీతో కలుస్తున్నామని జగన్ చెప్పొచ్చు.

ప్రస్తుతానికైతే రాష్ట్ర రాజకీయాలలో టీడీపీ, బీజేపీలు తన్నుకుంటున్నాయి. వైసిపి మాత్రం ప్రత్యేక హోదా ఇచ్చేవారికే మా మద్దతు అనే స్టాండ్ మీద వుంది. బీజేపీతో టీడీపీ పొత్తు ఎన్నికల దాకా అనుమానమే! ప్రత్యేకహోదా ఇవ్వకుంటే ఆ పార్టీతో వైసిపి కూడా కలవదు. కాబట్టి వచ్చే ఎన్నికల్లో భాజపాది ఒంటరి పయనమా? లేక జంట ప్రయాణమా? అన్నది చూడాలి!

# కల్యాణ వైభవం...!



సూర్యా సూపర్‌మార్కెట్ అధినేత ముడి జయరామరెడ్డి - ఇందిరమ్మల మనుమడు, ముడి శోభన్‌కుమార్‌రెడ్డి - హేమలతల కుమారుడు **ప్రజిత్ - ఆంచల్** (హైదరాబాద్ వాస్తవ్యులు హర్మేష్ కుమార్ శర్మ - రీతు శర్మల కుమార్తె)ల వివాహం హైదరాబాద్‌లోని అలంక్రిత రిసార్ట్స్ నందు, రిసెప్షన్ వేడుక ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.



నెల్లూరు మాగుంట లే అవుట్ వాస్తవ్యులు శానంపూడి శ్రీనివాసులరెడ్డి - సుందరిల కుమారుడు **వింజోష్‌రెడ్డి - తన్మయి** (ధనలక్ష్మీపురం వాస్తవ్యులు కరేటి వెంకటసుబ్బారెడ్డి - శాలినిల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 3వ తేదీ నెల్లూరులోని పరమేశ్వరి కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## జేసీ ఇంతియాజ్‌కు అదనపు బాధ్యతలు



నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు మెంబర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మైనారిటీస్ వెల్ఫేర్(ఐడిఎం) శాఖ ఈ నెల 14న జిఓఎంఎస్ నెం. 10 విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే వక్ఫ్‌బోర్డు సమావేశాల సమయంలో అజెండా రూపొందించడం, వక్ఫ్‌బోర్డు కార్యక్రమాలు అమలు తదితర అంశాలను ఆయన పర్యవేక్షిస్తారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మెంబర్‌గా అదనపు బాధ్యతలు పొందిన జేసీకి జిల్లా అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## ఏఐసిసి సభ్యులుగా నెల్లూరీయులు





ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటి (ఏఐసిసి) సభ్యులుగా నెల్లూరుజిల్లాకు చెందిన పొన్నబోయిన చెంచలబాబు యాదవ్, చేవూరు దేవకుమార్‌రెడ్డిని నియమించినట్లు ఈ నెల 14న ఏఐసిసి ప్రకటించింది. ఇందుకు సంబంధించిన నియామకపు ఉత్తర్వులను పిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి వారికి ఫ్యాక్స్ ద్వారా పంపారు. కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మికి ప్రకాశం జిల్లా నుంచి ఏఐసిసి సభ్యత్వం లభించింది.

## విళంబికి కొత్త రూపు!

- చిన్ని నారాయణరావు

ఇది దగాపడ్డ ఉగాది
దిగాలుపడ్డ ఉగాది
హామీలన్నీ నీటిబుడగలైపోతే
చిగురించేందుకు ఏమీ మిగలక శిశిరం కాటేసింది.
ఇక.. చైత్రం కూడా ముఖం చాటేస్తుందేమో!
ప్రత్యేక హోదా గోదాలో
మనిషి మనిషిగా మిగలకపోతే
రాజకీయాలు అందని చందమామల్ని చూపి
అగాధపు అంచులకు నెట్టేస్తే
పురిటిబిడ్డ అని కూడా చూడకుండా
పాలుపట్టడం మానేస్తే
నిన్నటి ఉగాది ఉషస్సు లేనిదై వెలవెలబోయింది.
తూర్పు తెల్లవారకపోతే
మార్పు వీవెన వీయకపోతే
తెలుగువాడి బ్రతుక్కు ఉష:సమీరాలు వీచేదెట్లా?..
బ్యాంకుల హామీల చట్రబంధంలో చిక్కుకొని
జనం డబ్బులు పప్పుబెల్లాలుగా పంచేస్తే
ఏ ఉగాది మాత్రం ఉషస్సును ప్రభవించగలదు.
విళంబి సాక్షిగా చెబుతున్నాను
సవాళ్ళ జిఎస్‌టితో ఓ ప్రక్క
ఆడిట్లు లేని బ్యాంకింగ్ రంగంతో మరో ప్రక్క
దేశం ముందడుగు వేయడం ఇక అసాధ్యం!...
ప్రభుత్వాలు ఏదో చేస్తాయని
ఎండమావులెంట పరుగులెత్తితే
స్వీయ నియంత్రణ లేని బ్రతుకింతే!..
రవి రాజై, శని మంత్రై సవాలు విసిరే విళంబిని
మనం ఎదురీదాలి.
కాలాన్ని లుంగీగా చుట్టుకుని
నిత్యం పయనించే మనుషులం
చావు తప్పదని తెల్సినా
చేవతో వేకువల్ని సొంతం చేసుకోగలం
వెలుగుల్ని సృష్టించుకోగలం
విళంబికి కొత్త రూపు నివ్వగలం!

## నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య



మునిసిపల్ పాఠశాల వార్షికోత్సవ ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

పేద, నిరుపేదల పిల్లలకు నాణ్యతతో కూడిన కార్పొరేట్ విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పి.నారాయణ అన్నారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని విఆర్ కళాశాల మైదానంలో మునిసి పల్ పాఠశాల వార్షికోత్సవం ముగింపు సభలో పాల్గొని మాట్లాడుతూ, నగరంలోని డికెడబ్ల్యు, విఆర్‌సి, సర్వోదయ కళాశా లలకు పూర్వవైభవం తీసుకురావడం తన లక్ష్యమన్నారు. రాష్ట్రంలో మునిసిపల్ పాఠశాలలకు మౌలిక వసతుల ఏర్పాటులో భాగంగా సిఎస్ఆర్ నిధులతో 70,000 బల్లలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఆలీంబాషా పాల్గొన్నారు.

## 17న నెరసం ఉగాది సంబరాలు

నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో ఈనెల 17వ తేది సాయంత్రం 5 గంటలకు స్థానిక శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం రీడింగ్‌హాల్‌లో శ్రీ విళంబి నామ సంవత్సం ఉగాది సంబరాలు నిర్వహిస్తామని నెరసం అధ్యక్ష కార్యదర్శులు ఏ.జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురికి ఉగాది పురస్కారాలను అందజేస్తామన్నారు. అనంతరం ఉగాది కవిసమ్మేళనం జరుగుతుందని, జిల్లాలోని కవులు, కవయిత్రులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## బిజిఆర్ కళాశాల 21వ వార్షికోత్సవ వేడుకలు




నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల 21వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా కిమ్స్ ఆసుపత్రి న్యూరోసర్జన్ ఏవి రమణ మూర్తి, పెథాలజిస్ట్ బివి వైదేహి, కొండా బల రామిరెడ్డి, బెజవాడ ఓబులురెడ్డి, అచ్చుత సుబ్రహ్మణ్యం, పూర్వ ప్రిన్సిపాల్ సన్నపురెడ్డి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మృదుల, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.










Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com